



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక




సంచిక : 277 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 26-1 -2026 పేజీలు-8 | వెల: రూ. 5.00



## ఘర్షణాత్మక ప్రపంచంలో భారత్ శాంతి దూత

- 77వ గణతంత్ర దినోత్సవాల సందర్భంగా జాతిని ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- దేశాభివృద్ధిలో నారీ శక్తి కృషి అత్యంత ప్రశంసనీయం
- ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా భారత్

న్యూఢిల్లీ:
ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో ఘర్షణలతో కూడిన వాతావరణం ఉన్నదని, అటువంటి సమయంలో భారత దేశం శాంతి సందేశాన్ని వ్యాపింపజేస్తున్నదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. 77వ గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ఆమె ఆదివారం జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. నిరుడు 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశామని, అనేక మంది ఉగ్రవాదులను మట్టుబెట్టామని చెప్పారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళలు చురుగ్గా, సాధికారతతో భాగస్వాములు కావడం చాలా ముఖ్యమని తెలిపారు.2047నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి నారీ శక్తి చేస్తున్న కృషిని ప్రశంసించారు. దశాబ్దాల నుంచి పేదరికంలో మగ్గిపోయిన లక్షలాది మందిని దారిద్ర్య రేఖకు ఎగువకు తీసుకురాగలిగినట్లు చెప్పారు. ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ పయనిస్తున్నదని తెలిపారు.

## విద్యా ఒత్తిళ్లే ఉసురుతీస్తున్నాయి !



- విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రధాన కారణం ఇదే
- ఉన్నత విద్యా సంస్థల్లో మానసిక ఆరోగ్య సదుపాయాల లోపం
- పేరుకే సహాయ వ్యవస్థలు
- సుప్రీంకోర్టు టాస్క్‌ఫోర్స్ నివేదిక

న్యూఢిల్లీ
విద్యార్థుల్లో పెరుగుతున్న విద్యాభ్యాస సంబంధిత ఒత్తిళ్లు, విద్యా సంస్థల్లో సరైన మానసిక ఆరోగ్య సదుపాయలు లేకపోవడమే విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రధాన కారణాలని సుప్రీంకోర్టు నియమించిన జాతీయ టాస్క్‌ఫోర్స్ (ఎన్‌టిఎఫ్) నివేదించింది. ఈ టాస్క్‌ఫోర్స్ 2025లో దేశవ్యాప్తంగా చేపట్టిన సర్వేలో దాదాపు 12.8 లక్షల మంది విద్యార్థులు, 1.6 లక్షల మంది అధ్యాపకులు, 2.26 లక్షల మంది తల్లిదండ్రులు, 16,750 ఉన్నత విద్యా సంస్థలు పాల్గన్నాయి.

-మిగతా 2 లో



## క్రమశిక్షణతో కష్టపడదాం

### ప్రజల్లో ఉన్న వారికే టికెట్లు

- పైరవీలు అవసరం లేదు : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- బరిలో నిలిచే వారిని ఆర్థికంగానూ ఆదుకుంటాం : పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్
- మున్సిపల్ ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దు సీరియస్‌గా ఉండాలి
- దేవుళ్ల పేరుతో ఓట్లడిగే వారికి ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపు

హైదరాబాద్,
'మున్సిపల్ ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దు సీరియస్‌గా ఉండాలి. క్రమశిక్షణతో కష్టపడి ముందుకు వెళ్దాం. టికెట్ కోసం ఎలాంటి పైరవీలు అవసరం లేదు. పార్టీకి విధేయుడిగా ఉంటూ ప్రజల్లో పలుకుబడి ఉన్న వారికి సర్వేల ఆధారంగా టికెట్‌లు కేటాయిస్తాం' అని నీటిపారుదల శాఖ మంత్రి, నిజామాబాద్ పార్లమెంట్ మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి

-మిగతా 2 లో



## పద్మ అవార్డులు ప్రకటించిన కేంద్రం

- అచ్యుతానందన్ సహా ఐదుగురికి రెండో అత్యున్నత పౌర పురస్కారం
- మమ్ముటి, శిబూ సొరేన్ సహా 13 మందికి పద్మభూషణ్ అవార్డు
- 113 మందికి పద్మశ్రీ పురస్కారం.. తెలుగు రాష్ట్రాలకు పదకొండు పద్మశ్రీలు

న్యూఢిల్లీ,
గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డులు- 2026ను ఆదివారం ప్రకటించింది. బాలీవుడ్‌కు విశేష సేవలందించిన ప్రముఖ నటుడు ధర్మేంద్ర సింగ్ డియోల్ (మరణానంతరం)కు పద్మ విభూషణ్ ప్రకటించారు. కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ (మరణానంతరం), సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కేటీ థామస్, వయోలిన్ విద్వాంసురాలు ఎన్ రాజం, ప్రముఖ మలయాళ జర్నలిస్ట్ పి.

-మిగతా 2 లో



## 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు కర్తవ్యపథ్ ముస్తాబు


- ఉదయం 10.30 గంటలకు పరేడ్‌ప్రారంభం
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జాతీయ యుద్ధ స్మారక చిహ్నాన్ని సందర్శించడంతో ఈ కార్యక్రమం ప్రారంభం
- ముఖ్య అతిథులుగా యూరోపియన్ సభ్యులు ఆంటోనియో కోస్టా, ఉర్సులా వాన్ డెర్ లేయన్ హాజరు

-న్యూఢిల్లీ
సోమవారం నాడు దేశం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకోనుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కర్తవ్యపథ్ నుండి ఈ వేడుకలకు ప్రారంభిస్తారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షురాలు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. రాష్ట్రపతి భవన్ నుంచి జాతీయ యుద్ధ స్మారకచిహ్నం వరకు విస్తరించి ఉన్న కర్తవ్య పథ్ 150 ఏండ్ల జాతీయ గీతం వందేమాతరం, దేశ అపూర్వమైన పురోగతి, బలమైన సైనిక పరాక్రమం, దాని గొప్ప సాంస్కృతిక వైవిధ్యం, అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో కూడిన మరపురాని సమ్మేళనాన్ని ప్రదర్శించడానికి అలంకరించారు. ఉదయం 10.30 గంటలకు పరేడ్ ప్రారంభమై దాదాపు 90 నిమిషాల పాటు కొనసాగుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జాతీయ యుద్ధ స్మారక చిహ్నాన్ని సందర్శించడంతో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. అక్కడ ఆయన దేశానికి నాయకత్వం వహించి అమరవీరులకు పుష్పగుచ్ఛం

-మిగతా 2 లో

## బంగ్లాదేశ్‌లో మరో హిందువు హత్య..

- రాత్రి నిద్రిస్తుండగా పెట్రోల్ పోసి సజీవ దహనం



న్యూఢిల్లీ:
ఆందోళనలతో హింసాత్మకంగా మారిన బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆగడం లేదు. హిందువులపై దాడి చేయడం, హత్య చేయడం వంటి ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా.. తాజాగా మరో హిందువును హత్య చేశారు. 23 ఏళ్ల చంచల్ చంద్ర భౌమిక్ అనే యువకుడిని సజీవ దహనం చేసి చంపేశారు.

-మిగతా 2 లో



## ధరణి లోపాలపై చర్యలు

- లైసెన్స్‌డ్ సర్వేయర్లకు నియామక పత్రాలు
- రాష్ట్రవ్యాప్తంగా భూ సర్వే కోసం 600 రోవర్లు
- అగ్నిప్రమాద మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు
- అగ్ని ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ :
- రెవెన్యూ, విపత్తు నిర్వహణల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం
ధరణిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన లోపాలపై చర్యలు తీసుకుంటామని, నాటి రెవెన్యూ వ్యవస్థలో చోటుచేసుకున్న లోపాలను దాచి శునకానందం పొందేలా ప్రధాన ప్రతిపక్షం వ్యవహరిస్తున్న తీరు హాస్యాస్పదంగా ఉందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. భూభారతి వచ్చాక వేలకోట్ల అవినీతి జరిగిందన్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఈ ఆరోపణలపై నిపుణుల

-మిగతా 2 లో

## హిందీకి స్థానం లేదు

- బలవంతంగా రుద్దేందుకు అవకాశం ఇవ్వం
- తమిళనాడు సీఎం ఎం.కె స్టాలిన్



చెన్నై
హిందీ భాషను బలవంతంగా రుద్దేందుకు గతంలోనూ అవకాశం ఇవ్వలేదనీ, ప్రస్తుతం కూడా ఇవ్వబోమని, భవిష్యత్‌లోనూ అసలు ఆ అవకాశమే లేదని తమిళనాడు సీఎం ఎం.కె స్టాలిన్ స్పష్టం చేశారు. భాషా వీరుల దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో

-మిగతా 2 లో

## ఓటింగ్‌తోనే ప్రజాస్వామ్యం బలోపేతం

జాతీయ ఓటర్ల దినోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ




2 లో

## అభివృద్ధి,పాలన మరిచిన రేవంత్

### ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి వేధింపులు

- కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్
- నర్సాపూర్‌లో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ మంజూరు చేస్తే.. కాంగ్రెస్ సర్కార్ నిలిపివేసింది
- బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు



మెదక్,
నర్సాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, పాలన మరిచి కేవలం ప్రతిపక్షాలను వేధించడమే పనిగా పెట్టుకున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గానికి బీజేపీ నాయకులు పలువురు హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీజేపీ నర్సాపూర్ పట్టణ మహేందర్‌గౌడ్‌తో పాటు అతని అనుచరులు వంద మంది వరకు బీఆర్ఎస్‌లో చేరడంతో గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో అన్ని రంగాల్లో పురోగమించిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.200 పింఛన్‌ను రూ. 2వేలు చేసిందన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అమలు చేసిందన్నారు. వ్యవసాయానికి 13 గంటలు మించి

-మిగతా 2 లో

### 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు

## కర్తవ్యపథ్ ముస్తాబు

మొదటి తరువాయి

ఉంచి నివాళులు అర్పిస్తారు. ఆ తరువాత ప్రధానమంత్రి, ఇతర ప్రముఖులు కవాతును వీక్షించడానికి కర్తవ్య పథ్ వద్ద ఉన్న వందన వేదిక వద్దకు వెళతారు రాష్ట్రపతి, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు, యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు 'సాంప్రదాయ గుర్రపు బగ్గీ'లో రాకపోకలకు సైన్యంలోని అత్యంత సీనియర్ రెజిమెంట్ అయిన ప్రెసిడెంట్స్ బాడీగార్డ్ రక్షణ కల్పిస్తారు. సంప్రదాయం ప్రకారం, జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. దాని తరువాత దేశీయంగా అభివృద్ధి చేయబడిన ఫిరంగి ఆయుధ వ్యవస్థ అయిన 105 ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్ ఉపయోగించి 21-గన్ సెల్యూట్స్‌తో జాతీయ గీతం వినిపిస్తుంది. ఈ గన్ సెల్యూట్స్‌ను 172 ఫీల్డ్ రెజిమెంట్‌కు చెందిన 1721 సెరిమోనియల్ బ్యాటరీ ప్రదర్శిస్తుంది. వివిదతా మే ఏక్తా వైవిధ్యంలో ఏకత్వం' అనే ఇతివృత్తంతో జరిగే ఈ పరేడ్ లో 100 మంది సాంస్కృతిక కళాకారులు పాల్గొంటారు. ఈ పరేడ్ దేశ ఐక్యత, గొప్ప సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రదర్శించే సంగీత వాయిద్యాల గొప్ప ప్రదర్శనగా ఉండబోతోంది. ధ్వజ్ ఫార్మేషన్‌లోని 129 హెలికాప్టర్ యూనిట్స్‌కు చెందిన నాలుగు ఎంఐ-171 హెలికాప్టర్లు పూల రేకుల వర్షం కురిపిస్తాయి. జాతీయ జెండాను ఎగురవేస్తూ, ఈ హెలికాప్టర్ల ఏర్పాటుకు గ్రూప్ కెప్టెన్ అలోక్ అహ్లావత్ నాయకత్వం వహిస్తారు. ఆ తరువాత రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించడంతో పరేడ్ ప్రారంభమవుతుంది. పరేడ్‌కు ఢిల్లీ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్, రెండో తరం అధికారి లెఫ్టినెంట్ జనరల్ భావ్ నీష్ కుమార్ నాయకత్వం వహిస్తారు. ఢిల్లీ ఏరియా ప్రధాన కార్యాలయం చీఫ్ ఆఫ్ స్టాఫ్, మూడో తరం ఆర్మీ అధికారి మేజర్ జనరల్ నవరాజ్ ధిల్లాన్ పరేడ్‌కు సెకండ్-ఇన్-కమాండ్‌గా ఉంటారు. అత్యున్నత శౌర్య పురస్కారాలను సొంత చేసుకున్న విజేతలు తరువాత వస్తారు. వారిలో పరమ వీర చక్ర విజేతలు సుబేదార్ మేజర్ (గౌరవ కెప్టెన్) యోగేంద్ర సింగ్ యాదవ్ (రిటైర్డ్), సుబేదార్ మేజర్ సంజరు కుమార్, అశోక్ చక్ర విజేతలు మేజర్ జనరల్ సిఎ పితావాలియా (రిటైర్డ్), కల్నల్ డి. శ్రీరామ్ కుమార్ ఉన్నారు

## బంగ్లాదేశ్‌లో మరో హిందువు హత్య..

మొదటి తరువాయి

ఈ ఘటన బంగ్లాదేశ్, నార్సింగ్డి జిల్లాలోని మసీద్ మార్కెట్ ఏరియాలో శుక్రవారం రాత్రి జరిగింది.అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. చంచల్ చంద్ర.. కుమిల్లా జిల్లా, లక్ష్మీపూర్ అనే గ్రామంలోని ఒక గ్యారేజ్‌లో కొన్నేళ్లుగా పని చేస్తున్నాడు. అక్కడే షట్టర్ మూసి శుక్రవారం రాత్రి నిద్రపోయాడు. అతడు గ్యారేజ్‌లో నిద్రిస్తుండగా.. కొందరు దుండగులు బయటి నుంచి పెట్రోల్ పోసి నిప్పంటించారు. క్షణాల్లోనే మంటలు లోపలిదాకా వ్యాపించాయి. దీంతో చంచల్ చంద్ర లోపలే అగ్నికి ఆహుతి అయ్యాడు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేశారు. దాదాపు అరగంటపాటు శ్రమించి, మంటల్ని ఆర్పేశారు. అనంతరం చంచల్ చంద్ర మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనపై బాధితుడి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన హత్య అని ఆరోపించారు. నిందితుల్ని పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు. మరోవైపు అక్కడ హిందువులకు భద్రత లేకపోవడంపై హిందువులు సహా, మైనారిటీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## అభివృద్ధి, పాలన మరిచిన రేవంత్

మొదటి తరువాయి

కరెంట్ సరఫరా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నర్సాపూర్‌లో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను మంజూరు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం దానిని పనులు నిలిపివేసిందన్నారు. రైతులకు రైతుభరోసా సకాలంలో ఇవ్వడం లేదని, రైతులు పెట్టుబడి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతురని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో నాట్లకు నాట్లకు మధ్య రైతు బంధు డబ్బులు వేసేవారని, కాంగ్రెస్ ఓట్లు ఉంటేనే రైతుభరోసా వేస్తుందని ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## హిందీకి స్థానం లేదు

మొదటి తరువాయి

చేసిన పోస్టులో సీఎం స్టాలిన్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. హిందీ బలవంతానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో ఇకపై ఒక్క ప్రాణం కూడా కోల్పోవాల్సిన అవసరం రాకూడదని అన్నారు. తమిళుల భాషా భావోద్వేగం ఎప్పటికీ చావదనీ, హిందీ బలవంతానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని ఆయన వివరించారు. దేశంలో తన భాషను ప్రాణంలో ప్రేమించే ఏకైక రాష్ట్రం తమిళనాడేనని వ్యాఖ్యానించిన స్టాలిన్.. ప్రతి సందర్భంలోనూ రాష్ట్ర ఐక్యంగా నిలిచి హిందీ విధింపును తీవ్రంగా వ్యతిరేకించిందని గుర్తు చేశారు. అలాగే భారత ఉపఖండంలోని అన్ని భాషా కుటుంబాల హక్కులు, గుర్తింపును తమిళనాడు కాపాడిందని చెప్పారు. హిందీ విధింపును వ్యతిరేకిస్తూ తమ ప్రాణాలను అర్పించిన భాషా వీరులకు ఆయన ఘన నివాళులు అర్పించారు.

## ఓటింగ్‌తోనే ప్రజాస్వామ్యం బలోపేతం

**జాతీయ ఓటర్ల దినోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**

**హైదరాబాద్,**

ప్రతిపౌరుడు తన ఓటుహక్కును బాధ్యత, అవగాహనతో వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతమవుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం స్థాపనను గుర్తుచేసుకుంటూ ప్రతి ఏడాది జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకొంటున్నట్టు చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-324 ప్రకారం భారత ఎన్నికల సంఘానికి కల్పించిన స్వతంత్రత, నిష్పక్ష, స్వేచ్ఛాయుత, న్యాయసమ్మత ఎన్నికలకు పునాది అని పేర్కొన్నారు. అంబేదర్, గాంధీ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం నిలబడదని చెప్పారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, అర్హులైన ఓటర్లకు హోంఓటింగ్, ఆధునిక సాంకేతికత వినియోగం ద్వారా ఎన్నికలు మరింత సమగ్రంగా మారాయని ప్రశంసించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికను డ్రోన్ నిఘా, పోలీసుల సమన్వయంతో ప్రశాంతంగా నిర్వహించిన తీరును గవర్నర్ అభినందించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో అవార్డులు పొందినవారికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఈవో చేతుల మీదుగా అందజేశారు.

# విద్యా ఒత్తిళ్లే ఉసురుతీస్తున్నాయి !

మొదటి తరువాయి

ఎస్‌టిఎఫ్ నివేదిక ప్రకారం.. 15-29 ఏళ్ల వయసు గలవారిలో పురుషులకు ఆత్మహత్య రెండో పెద్ద మరణ కారణం కాగా.. మహిళలకు ఇది మొదటి కారణంగా ఉన్నది. 2022లో సుమారు 13 వేల మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నట్టు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) డేటా వెల్లడించింది. ఐఐటీల్లో గత 30 నెలల్లోనే 40 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సీ, ఎస్టీ, ఒబిసిలు, వికలాంగులు, మహిళలు, ఇంగ్లీష్ మాట్లాడనివారు, గ్రామీణ నేపథ్యం కలిగిన విద్యార్థులు కళాశాలల్లో ప్రత్యేకంగా వెనుకబడినవారిగా ఉన్నారు. వీరి కోసం ఏర్పాటు చేయాల్సిన ఈక్వల్ ఆపర్చునటీ సెల్స్ (ఇఒసిలు), ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీలు (ఐసిసిలు) చాలా చోట్ల కాగితాలకే పరిమితమయ్యాయని టాస్క్‌ఫోర్స్ తీవ్ర విమర్శలు చేసింది. ఈ కమిటీలకు స్వతంత్రత లేకపోవడం, నిందితులకే మద్దతు ఇవ్వడం వల్ల విద్యార్థులు విద్యార్థులు ఫిర్యాదులు చేయడానికి భయపడుతున్నారని పేర్కొన్నది. బాండింగ్, ఫ్రెండ్లీ పరిచయం పేరుతో ర్యాగింగ్ కొనసాగుతోందనీ, దానిపై చర్యలు ఆశించినంతగా లేవని వివరించింది.



విద్యార్థులు అధిక విద్యా ఒత్తిడి, కఠిన హాజరు నిబంధనలు, సరిగ్గా ప్రణాళిక చేయని పాఠ్య ప్రణాళిక, అధ్యాపకుల కొరత, అనుభవం లేని గెస్ట్ ఫ్యాకల్టీపై ఆధారపడటం, స్పష్టత లేని ప్లేస్‌మెంట్ విధానాలపై ఫిర్యాదులు చేశారు. పీహెచ్‌డీ విద్యార్థులు పరిశోధన ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, గైడ్‌లతో సంబంధాలలో అసమానతలు, ల్యాబ్ సదుపాయాల లోపంతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనతువున్నారు. సుమారు 65 శాతం సంస్థల్లో క్యాంపస్‌లో మానసిక ఆరోగ్య నిపుణులే లేరని సర్వేలో వెల్లడైంది. ఈ నివేదిక ఆధారంగా సుప్రీంకోర్టు విద్యార్థులకు సురక్షితమైన, సమానమైన, స్పందన కలిగిన క్యాంపస్‌లు కల్పించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని స్పష్టం చేసింది. టాస్క్‌ఫోర్స్ పదవీకాలాన్ని జూన్ 30 వరకు పొడిగిస్తూ.. మానసిక ఆరోగ్య సేవల కోసం మార్గదర్శకాలు (ఎస్ఒపిలు) రూపొందించాలని ఆదేశించింది.

# పద్మ అవార్డులు ప్రకటించిన కేంద్రం

మొదటి తరువాయి

నారాయణన్‌కు కూడా పద్మవిభూషణ్ పురస్కారం వరించింది. ప్రముఖ మలయాళ నటుడు మమ్ముట్టి, జార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరేన్, ప్రముఖ వైద్యులు నోరి దత్తాత్రేయుడు సహా 13 మందికి పద్మభూషణ్ ప్రకటించారు. ప్రముఖ క్రికెటర్ రోహిత్ శర్మ, భారత మహిళా క్రికెట్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ సహా 113 మంది పద్మశ్రీ పురస్కారం లభించింది. ప్రముఖ తెలుగు నటులు రాజేంద్ర ప్రసాద్, మురళీ మోహన్, గంధం చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌ను హతమార్చిన ఎస్‌టీఎఫ్‌కు నేతృత్వం వహించిన సీఆర్‌పీఎఫ్ మాజీ డీజీ కే విజయ్ కుమార్ కూడా పద్మశ్రీ అవార్డు గ్రహీతల్లో ఉన్నారు. మొత్తంగా ఈ ఏడాది 131 మందికి పద్మ అవార్డులు దక్కాయి. మొత్తం అవార్డు గ్రహీతల్లో 90 మంది మహిళలు ఉన్నారు. జాబితాలో విదేశీయులు, ఎన్ఆర్ఐ, పీఐవో, ఓసీఐ క్యాటగిరీ కింద ఆరుగురికి అవార్డులు ప్రకటించారు. మరణానంతరం 16 మందికి అవార్డులు ప్రకటించారు.

**తెలంగాణ నుంచి ఏడుగురు**

తెలంగాణ నుంచి ఏడుగురికి పద్మశ్రీ పురస్కారాలు



దక్కాయి. వీరిలో గడ్డమనుగు చంద్రమౌళి (సైన్స్), దీపికా రెడ్డి (నృత్యకారిణి), గూడూరు వెంకట్రావు (వైద్యం), కృష్ణమూర్తి బాల సుబ్రహ్మణియన్ (సైన్స్, ఇంజినీరింగ్), కుమారస్వామి తంగరాజ్ (సైన్స్, ఇంజినీరింగ్), పాల్కొండ విజయ్ ఆనంద్ రెడ్డి (వైద్యం), రామారెడ్డి మామిడి (మరణానంతరం) (పశు సంవర్ధక, పాడి పరిశ్రమ) ఉన్నారు. యూజీసీ మాజీ చైర్మన్ మామిడాల జగదీశ్ కుమార్‌కు ఢిల్లీ కోటాలో పద్మశ్రీ వరించింది. ఏపీ నుంచి నటుడు గద్దె బాబా రాజేంద్రప్రసాద్ (కళలు), మాగంటి మురళీ మోహన్ (కళలు), గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (కళలు), వెంపటి కుటుంబ శాస్త్రి (సాహిత్యం)కి పద్మశ్రీ ప్రకటించారు.

**అన్‌సంగ్ హీరోలు**

పద్మశ్రీ అవార్డుల్లో గుర్తింపు పొందని వీరుల (అన్‌సంగ్ హీరోస్) విభాగంలో అతి పెద్ద ఉచిత గ్రంథాలయాన్ని నెలకొల్పిన మాజీ బస్ కండక్టర్ అంకె గౌడ, ఆసియాలోనే మొదటి మానవ మిల్క్ బ్యాంక్‌ను స్థాపించిన పిల్లల వైద్య నిపుణురాలు అర్మిదా ఫెర్నాండెజ్, అరుదైన వాద్యం వాయించే 90 ఏండ్ల సంగీతకారుడు భిక్లయ లద్య్క దిండా ఉన్నారు. కర్ణాటకకు చెందిన అంకె గౌడ 20 భాషల్లోని 20 లక్షల పుస్తకాలు సేకరించి ప్రజల కోసం ప్రపంచంలోనే అతి పెద్ద ఉచిత గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇక ఆసియాలోనే మొట్టమొదటి మానవ పాల బ్యాంక్ వ్యవస్థాపకురాలిగా మహారాష్ట్రకు చెందిన శిశువైద్యురాలు అర్మిడా ఫెర్నాండెజ్ పేరు పొందారు. మహారాష్ట్రకు చెందిన సంగీతకారుడు భిక్లయ లద్య్క దిండా సొరకాయ బుర్ర, వెదురుతో తయారు చేసిన తర్పా అనే అరుదైన వాద్యాన్ని వాయించడంలో నేర్పరి. ఈ క్యాటగిరీలో మొత్తం 45 మందికి పద్మశ్రీ అవార్డు దక్కింది.

# క్రమశిక్షణతో కష్టపడదాం

మొదటి తరువాయి

ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ హౌటల్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయి కమిటీల కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన రెండేండ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అటు అభివృద్ధిలో, ఇటు సంక్షేమంలో ముందున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికీ వివరించాలని అన్నారు. రేషన్‌కార్డు ద్వారా సన్న బియ్యం పంపిణీ దేశంలో ఎక్కడా లేదని, మన దగ్గరే అమలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యకర్తల త్యాగాల వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, మూల స్థంభాలైన వారిని మరవబోమని అన్నారు. ఏకాభిప్రాయం ఉన్న చోట అభ్యర్థులను ప్రకటించాలని, పోటీ ఉన్న చోట సర్వేల ఫలితాల ఆధారంగా టికెట్‌లు కేటాయించనున్నట్టు తెలిపారు. మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. అభ్యర్థుల ఎంపికకు జల్లెడ పడుతున్నామని, పాత వారితోపాటు కొత్త వారికి సైతం అవకాశం వస్తుందని, ఆర్థికంగా బలహీనంగా ఉన్న వారిని పార్టీ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. బీజేపీ ఎన్నికల నినాదాలతో ప్రజల్లో మార్పు వచ్చిందని, లోక్‌సభ ఎన్నికల్లో అరవింద్‌కు నిజామాబాద్ అర్బన్‌లో తక్కువ ఓట్లు వచ్చినట్టు గుర్తుచేశారు. దేవుళ్ల పేరుతో ఓట్లడగబోమని మరోసారి పునరుద్ఘాటించారు. బీజేపీ, ఎంఐఎం రెండు పార్టీలను మతతత్వ పార్టీలుగానే చూస్తున్నట్టు, రెండు పార్టీలకు సమాన దూరంగా ఉంటామని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ రాకపోతే సర్వం కోల్పోయినట్టు కాదని, అర్బన్ సీటును తాను త్యాగం చేస్తే ఎమ్మెల్సీ పదవి వరించిందని.. అదే విధంగా అవకాశాలు వస్తాయని భరోసా కల్పించారు. ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. విబేధాలు పక్కన పెట్టి ఐక్యంగా ఉంటేనే విజయం సాధిస్తామని అన్నారు. అలాగే ఆర్మూర్ పట్టణంలో ఆర్మూర్-బాల్కొండ నియోజకవర్గాలను కలిపి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్నాహక సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే భూపతి రెడ్డి, డీసీసీ అధ్యక్షులు నగేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ధరణి లోపాలపై చర్యలు

మొదటి తరువాయి

కమిటీతో విచారణ చేయించామన్నారు. రిజిస్ట్రేషన్ల విషయంలో రూ.3.9 కోట్ల అవకతవకలు జరిగినట్టు గుర్తించి సంబంధిత మీసేవ నిర్వాహకులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు. శిక్షణ పూర్తయిన లైసెన్స్ సర్వేయర్లకు మంత్రి పొంగులేటి ఖమ్మం ఐడీఓసీలో ఆదివారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ఫర్నిచర్ దుకాణంలో జరిగిన అగ్ని ప్రమాద మృతుల కుటుంబాలు ఒక్కంటికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామన్నారు. గతంలోని టేపులు, గొలుసుల పద్ధతులకు స్వస్తి పలికి, సెంటీమీటర్లతో సహా కచ్చితంగా వచ్చేలా 'రోవర్స్' సాంకేతికతను వాడుతున్నామన్నారు. ఇప్పటికే 600 రోవర్లను కొనుగోలు చేసి జిల్లాలకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ పొందిన 5,500 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను మండలాల వారీగా భూ విస్తీర్ణం ప్రాతిపదికన కేటాయించామని అన్నారు. ధరణిలో అవకతవకలపై కేరళకు చెందిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ చేత ఫోరెన్సిక్‌తో విచారణ చేపట్టినట్టు చెప్పారు. ఇందుకోసం పైలెట్ ప్రాజెక్టుగా సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలను ఎంపిక చేసినట్టు తెలిపారు. భూములకు సంబంధించి ప్రతి అంగుళాన్ని డిజిటలైజ్ చేసి, యజమానులకు శాశ్వత యాజమాన్య భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

గత పాలకుల హయాంలో రెవెన్యూ వ్యవస్థను పూర్తి స్థాయిలో నాశనం చేశారని, ప్రజా ప్రభుత్వం వీఆర్ఓ, వీఆర్ఏ లను మరొకసారి గ్రామ పరిపాలన అధికారులుగా రెవెన్యూ వ్యవస్థలోకి తీసుకొని వచ్చామని, వీరికి సపోర్ట్ గా లైసెన్స్ సర్వేయర్ లను నియమించామని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. రికార్డు సమయంలో భూ భారతి చట్టం నియమాలు కూడా రూపొందించారని, సెక్షన్ 9 ప్రకారం సర్వే సమస్యల పరిష్కారం కోసం భూదార్ జారీ చేయడం, మ్యాప్ రూపకల్పన పొందుపర్చారని, దీని కోసం మండల సర్వేయర్ ఆధ్వర్యంలో లైసెన్స్ సర్వేయర్‌లు పని చేస్తారని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అనంతరం 21 మండలాల సర్వేయర్లకు ల్యాప్ టాప్‌లు మంజూరు చేయాలని అదనపు కలెక్టర్ మంత్రిని కోరటంతో సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, కల్లూరు సబ్ కలెక్టర్ అజరు యాదవ్, డీఆర్ఓ ఏ. పద్మశ్రీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జాయింట్ డైరెక్టర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాజేందర్, ఆర్టీఐ మెంబర్ కోయిన వెంకన్న, వీవీ పాలెం సర్పంచ్ కాపా ఆదినారాయణ, తహసీల్దార్లు, లైసెన్స్ సర్వేయర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భారత ప్రజాస్వామ్య గర్వకారణం

# 77వ గణతంత్ర దినోత్సవం






భారతదేశం 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. రాజ్యాంగం అమలులోకి వచ్చిన ఈ రోజు ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలను గుర్తు చేస్తూ దేశవ్యాప్తంగా వేడుకలు జరిగాయి. 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి రావడంతో భారత్ సంపూర్ణ గణతంత్ర దేశంగా అవతరించింది. ఈ చారిత్రక నేపథ్యాన్ని గౌరవిస్తూ ప్రతి సంవత్సరం ఈ రోజునే గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. 2026లో 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరిగిన పరేడ్‌లో భారత రక్షణ శక్తి, రాష్ట్రాల సాంస్కృతిక వైవిధ్యం ప్రపంచానికి చాటబడింది. ఈ వేడుకలకు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో లూయిస్ శాంటోస్ డా కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రజాస్వామ్య ప్రయాణంలో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలుస్తూ, ఆర్థిక, శాస్త్రసాంకేతిక, రక్షణ రంగాల్లో విశేష పురోగతి సాధించింది. యోగా, ఆయుర్వేదం, వసుధైవ కుటుంబకం వంటి భారతీయ విలువలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయి. గణతంత్ర దినోత్సవం ప్రతి పౌరుడికి రాజ్యాంగాన్ని గౌరవించడం, హక్కులతో పాటు కర్తవ్యాలను నిర్వర్తించడం గుర్తు చేస్తుంది. దేశ ఐక్యత, సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి భారతీయుడు కృషి చేయాలని ఈ రోజు సందేశం ఇస్తోంది.

**జై హింద్ వందేమాతరం**

వేల్పుల మహేందర్,
ఎంఎస్ సీ, ఎంఏ, ఎం.ఈడి,
అధ్యాపకులు



# క్రేడ్ రైట్ రికవరీ ఏజెంట్ల ఆగడాలు



**పెద్దపల్లి ,జనవరి25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇటీవల కాలంలో లోన్ రికవరీ ఏజెంట్ల వేధింపులు బాగా పెరిగిపోతున్నాయి. దీనితో చాలా మంది ఈ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఒక్క లేడీస్ టైలర్ దగ్గర మహిళ అని చూడకుండా ఆమెపై కస్టమర్ల ముందు,దురుసుగా ప్రవర్తించిన,క్రేడ్ రైట్ ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లు నా ఆరోగ్యం బాగో లేక లోన్ కట్టలేదు అని చెప్పిన నువ్వు సచ్చిన కూడా లోన్ కట్టవాల్సిందే అని షాప్ కి తాళం వేస్తాము అని మానసికంగా వేధించారు. ఈ సందర్భంగా మీడియాతో లేడీస్ టైలర్ ఆమె మాట్లాడుతూ నా లాంటి ఇలాంటి వాళ్ళు చాలా ఉన్నారు అని ,లోన్ ఇచ్చేముందు మాకు ఎలాంటి రూల్స్ చెప్పకుండా 28000,తో పాటు ఒక్క నెల ఈఎంఐ కట్ చేశారని, కట్ చేసిన డబ్బుల గురించి అడగగా మాకు స్టేట్మెంట్ ఇవ్వమని కోరగా మేము స్టేట్మెంట్ ఇవ్వము అని ఏం చేసుకుంటావో చేసుకో అని,దురుసుగా మాట్లాడారు. మాకు రూపాయి వడ్డీ పడతది అని చెప్పి అడ్డగోలుగా వడ్డీ వేస్తూ ,నా షాప్ దగ్గరికి వచ్చి నన్ను ఇష్టం ఉన్నట్టు బూతులు తిడుతూ నువ్వు లోన్ ఎందుకు తీసుకున్నావే అని, అందరి ముందు నా నా పరువు తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలాంటి అమాయకమైన మహిళను టార్గెట్ చేస్తూ, లోన్ కట్టని యెడల రికవరీ ఏజెంట్లు వచ్చి ఇస్తా రీతిగా మానసికంగా వేధిస్తున్నారు. ఇలాంటి రికవరీ ఏజెంట్ల పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని పోలీసులను బాధితులు కోరుతున్నారు.

# హుస్నాబాద్ మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలకు నాంది



**హుస్నాబాద్ జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశంలో తెలిపారు. స్థానిక ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడం వల్లే ఇప్పటి వరకు అభివృద్ధి సాధ్యమైందని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే ఉత్సాహంతో అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ పనులు వేగవంతం అవుతున్నాయని, హుస్నాబాద్‌కరీంనగర్ మధ్య నాలుగు లైన్ రహదారి, ఎలకతుర్తిసిద్దిపేట జాతీయ రహదారి, అక్కన్నపేట రహదారి పనులు జరుగుతున్నాయని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారం, 250 పడకల ఆసుపత్రి నిర్మాణం, పీజీ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, చౌటపల్లి వద్ద ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్, ఎల్లమ్మ చెరువు సుందరీకరణ వంటి పనులు జరుగుతున్నాయని వివరించారు. పర్యాటక అభివృద్ధి కోసం రాయికల్ వాటర్ ఫాల్స్, మహా సముద్రం గండి, భైరవ స్వామి గుడి ప్రాజెక్టులు చేపడుతున్నామని, ఇండోర్ స్టేడియం వద్ద స్విమ్మింగ్ పూల్, చిల్డ్రన్ పార్క్, షాపింగ్ కాంప్లెక్స్ లు, శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ, ఆర్టీఏ కార్యాలయం, నవోదయ పాఠశాల, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వంటి ప్రాజెక్టులు హుస్నాబాద్ ప్రాంతానికి తలమానికం అవుతాయని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ చీరలు, రేషన్ కార్డులు, ఇళ్లు, విద్యుత్ సబ్సిడీ వంటి పథకాలు కొనసాగుతున్నాయని, రైతు భరోసా, రుణమాఫీ, ఉద్యోగాల భర్తీ, మార్కెట్ అభివృద్ధి, గిరిజన సంక్షేమం, కబడ్డీ అకాడమీ వంటి కార్యక్రమాలు అమలవుతున్నాయని చెప్పారు. హుస్నాబాద్ ప్రజలు గతంలో ఇచ్చిన మద్దతు వల్లే అభివృద్ధి సాధ్యమైందని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే విశ్వాసంతో అండగా నిలవాలని ఆయన కోరారు.

## యత్మతాపుర్‌లో గ్రామపంచాయతీ భవనం ప్రారంభం



**తాడూరు, జనవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తాడూరు మండల పరిధిలోని యత్మతాపుర్ గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అదే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతూ గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సింగిరెడ్డి మాధవి, వెంకటేశ్వర రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, సంబంధిత అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పల్లెల్లో సమ్మక్క సారలమ్మ ఎత్తు బంగారం మొక్కులు





**పాలకుర్తి ,జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు ఇంకా నాలుగు రోజులు మాత్రమే ఉండడంతో పాలకుర్తి మండలంలోని గ్రామాలన్నీ ఆదివారం ఎత్తు బంగారం మొక్కులతో పండగ వాతావరణంలో మునిగిపోయాయి. జాతరకు ముందు ఇళ్లల్లో మొక్కులు సమర్పించడానికి చివరి రోజు కావడంతో భక్తులు వనదేవతల ఆశీస్సులు కోరుతూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేకలు, కోళ్ళతో మొక్కులు చెల్లించి ఇళ్లల్లో దావత్‌లు ఏర్పాటు చేశారు. సోమవారం గణతంత్ర దినోత్సవం కారణంగా జంతుబలి, వైన్స్ షాపులు మూసివేయబడుతుండటంతో ఆదివారమే ఎక్కువ మంది భక్తులు తమ మొక్కులు పూర్తి చేశారు. పల్లెలన్నీ భక్తి పారవశ్యంతో నిండిపోవడంతో జాతర వాతావరణం ముందుగానే గ్రామాల్లో అలుముకుంది.

# ఘనంగా నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ



**కరీంనగర్ రూరల్, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బొమ్మకల్ 6వ డివిజన్‌లో శనివారం ప్రముఖ దినపత్రిక నీలగిరి ఎక్స్ప్రెస్ వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, బొమ్మకల్ మాజీ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్, రైల్వే బోర్డు సభ్యులు పాశం తిరుపతి హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నీలగిరి ఎక్స్ప్రెస్ తక్కువ కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకుని, ప్రజా సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుంటూ ప్రభుత్వానికిప్రజలకు మధ్య వారధిగా నిలుస్తోందని ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత విస్తృతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంగల్దాస్ శ్రీనివాస్, దాది సుధాకర్, మాజీ కోఆప్షన్ మెంబర్ కపిల్ మాధవ, మాజీ వార్డు సభ్యులు మ్యకల వెంకటేశ్, భాస్కర్ రెడ్డి, కాల్వ అశోక్ పాల్గొన్నారు. అలాగే డివిజన్ నాయకులు చిందం అశోక్, ఆసిరి తిరుపతి, పుట్టపాక శ్రీధర్, సాయవేణి సదానందం, గాలిపెల్లి నారాయణ, గన్ను రాజిరెడ్డి, కాల్వ మల్లేశం, కోరుకంటి శరత్, సాయి చంద్, సాగర్, రమేష్ తదితరులు హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బోనాలతో గ్రామ దేవతలకు ఆహ్వానం



**పాలకుర్తి, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో జరగబోయే శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు ఆదివారం గ్రామ దేవతలకు ఆహ్వానం పలికారు. గ్రామంలో ఏ శుభకార్యం జరిగినా ముందుగా దేవతలకు ఆహ్వానం పలకడం ఆనవాయితీగా ఉండటంతో, ఈనెల 27 నుండి 30 వరకు జరిగే జాతరకు కమిటీ ఆధ్వర్యంలో బోనాలు, డప్పుచప్పులతో బొడ్రాయి, భూలక్ష్మి, పోచమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మలకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమ్మక్క కమిటీ అధ్యక్షుడు ఎర్రం మల్లేశం, చైర్మన్ గాలిపల్లి నర్సయ్య, వైస్ చైర్మన్ తుంగ నర్సయ్య, కోశాధికారి గాలిపల్లి దుర్గయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామమంతా జాతర వాతావరణంలో మునిగిపోయింది.

# మేడారం జాతరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సౌకర్యాలు





**పెద్దపల్లి ,జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే భక్తుల కోసం పెద్దపల్లి నుండి ప్రత్యేక ఆర్టీసీ బస్సు సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. మొత్తం 175 బస్సులను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు. ఆదివారం ఆయన ఆర్టీసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి జాతర బస్సు సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దపల్లిలో బస్సు డిపో ఏర్పాటు చేయడం ప్రజల చిరకాల వాంఛ అని, పనులు వేగంగా సాగుతున్నాయని, త్వరలోనే డిపో ప్రారంభమవుతుందని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎక్కువ బస్సులు అందుబాటులో ఉంచామని, ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు భూపతి రెడ్డి, కల్పనతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారిపై కాంగ్రెస్ పార్టీ సమావేశం



**మానకొండూర్ జనవరి 25 తిమ్మాపూర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అల్గునూర్ రాజీవ్ రహదారిపై ఆదివారం కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించడంపై తిమ్మాపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిపై సభలు, ధర్నాలు జరగడం వల్ల కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, అరకొరగా ఉన్న పోలీసులకు పరిస్థితిని నియంత్రించడం కష్టమవుతోందని ఆయన అన్నారు. సాధారణంగా ఇలాంటి కార్యక్రమాలకు పోలీసులు అనుమతి ఇవ్వరని, అనుమతి లేకుండా నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తారని గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ పార్టీ సమావేశానికి అనుమతి ఇచ్చారా లేదా అన్న ప్రశ్నకు పోలీసులు స్పష్టత ఇవ్వలేదని తెలిపారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలిగించే ప్రాంతాల్లో సభలకు అనుమతులు ఇవ్వకూడదని ఆయన మీడియా ద్వారా అధికార యంత్రాంగాన్ని కోరారు. నడిరోడ్లపై సభలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించడం కాంగ్రెస్ నాయకుల తీరని ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# వెల్దండలో శ్రీ చెన్నకేశవ స్వామి ప్రత్యేక పూజలు



**వెల్దండ, జనవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో రథసప్తమి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. స్వామివారి దర్శనార్థం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, మాజీ ఎంపిటిసి జ్యోతి నిరంజన్, జంగిలి యాదగిరి, వార్డు సభ్యులు రాలు సునీత ఆనంద్, జంగిలి బాబు, జంగిలి రఘు, జంగిలి జగ్గు, ఏకుల వెంకటేష్, ప్రభుదాస్, ప్రవీణ్, కూన్ బన్నీ, గోరేటి భరత్, డేవిడ్, జంగిలి రామస్వామి, తిరుపతయ్య, జంగిలి ప్రసాద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థుల గృహ సందర్శనలు



**ఒద్యారం, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జెడ్పీహెచ్ఎస్ ఒద్యారం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల విద్యా ప్రగతిని మెరుగుపరచే లక్ష్యంతో ఆదివారం ప్రత్యేక గృహ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎం, ఎంఈఓ ఎనుగు ప్రభాకర్ రావు, గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాస్ కలిసి పదవ తరగతికి చెందిన 14 మంది విద్యార్థుల ఇళ్లను సందర్శించారు. విద్యార్థుల మార్కుల రిజిస్టర్, హాజరు వివరాలను పరిశీలించి తల్లిదండ్రులతో ప్రత్యక్షంగా చర్చించారు. విద్యార్థుల బలాలు, బలహీనతలు, పాఠశాలలో వారి ప్రదర్శన, హాజరు స్థితి గురించి వివరించి, పాఠశాలలో చేపడుతున్న మెరుగుదల చర్యలు, ఇంటివద్ద తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని, పాఠశాలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులుతల్లిదండ్రుల సమన్వయంతో ఈ కార్యక్రమం విద్యార్థుల విద్యా ప్రగతికి దోహదపడుతుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన బొమ్మనపల్లి సర్పంచ్



**హుస్నాబాద్, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామ సర్పంచ్ కొంకటి మౌనిక ప్రజాపాలనకు ఆకర్షితమై మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వాన్ని సమర్థిస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరారు. హుస్నాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆమెకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మౌనిక కాంగ్రెస్ విధానాలు ప్రజల సమస్యల పరిష్కారానికి దోహదం చేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్, జిల్లా నాయకులు చిటుమల్ల రవీందర్, దాసరి ప్రవీణ్ కుమార్, వార్డు సభ్యుడు బడుకోలు దేవేందర్ రెడ్డి, నాయకులు బుర్ర శ్రీనివాస్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు తప్పక వినియోగించుకోవాలి

- - న్యాయమూర్తి ఎస్.శివకుమార్



**కరీంనగర్, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శివకుమార్ ప్రజాస్వామ్య దేశంలో సామాన్య పౌరుడి ఆయుధం ఓటు హక్కు అని, ఎన్నికల వేళ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తప్పక ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటు ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలకమని, ఓటు హక్కు వినియోగం ద్వారానే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఓటర్ ప్రతిజ్ఞ చేయించడంతో పాటు ఉత్తమ సేవలు అందించిన ఏఈఆర్ఓలు, ఈఆర్ఓలు, టెక్నికల్ మేనేజర్లు, బీఎల్వోలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. యువ ఓటర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. పలువురు సీనియర్ సిటిజన్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ ప్రదర్శనలు ఇచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ స్టేడియం నుంచి భగత్ సింగ్ చౌరస్తా మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ ర్యాలీని ప్రారంభించారు. “ఓటును మించి ఏది లేదు నేను కచ్చితంగా ఓటు వేస్తాను” అనే నినాదాలతో విద్యార్థులు, స్కౌట్స్, గైడ్స్, రెవెన్యూ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, జిల్లా క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, డీవైఎస్ఓ శ్రీనివాస్, జిల్లా యువజన అధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ శిబిరాలు సేవా దృక్పథాన్ని పెంపొందిస్తాయి




**మానకొండూర్, జనవరి 25 తిమ్మాపూర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: ఎన్ఎస్ఎస్ శిబిరాలు యువతలో సేవా భావాన్ని పెంపొందిస్తాయని గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు గవ్వ వంశీధర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా వాగేశ్వరి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో నిర్వహించిన శిబిరంలో పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని సూచించారు. సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ సెల్‌ఫోన్‌కు బానిస కాకూడదని హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయి, హెరెయిన్, కోకైన్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకుని తోటి వారికి చేయూతనందించాలని, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవాలని కోరారు. నేటి యువత రేపటి భారత పౌరులు అని, భవిష్యత్తులో వారికి అనేక అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చెన్నమల్ల చైతన్య, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంట అజయ్ పటేల్, బీఆర్ఎస్వి చొప్పదండి ఇంచార్జ్ రేకులపల్లి సతీష్ రెడ్డి, నాయకులు సముద్రాల ఓంకార్, మన్నెంపల్లి సర్పంచ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ



**హుస్నాబాద్, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మండలంలో ఆదివారం నాడు నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక క్యాలెండర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు అక్కు శీను, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామ సర్పంచులు పాల్గొని విజయవంతం చేశారు. క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా స్థానిక ప్రజలు, నాయకులు ఉత్సాహంగా హాజరై కార్యక్రమాన్ని మరింత విశిష్టంగా మార్చారు. నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక స్థానిక సమస్యలను, ప్రజల ఆవేదనలను, గ్రామీణ అభివృద్ధి అంశాలను నిరంతరం వెలుగులోకి తెస్తూ ప్రజలతో మమేకమై పనిచేస్తోందని ప్రసంగకులు ప్రశంసించారు. ప్రజల సమస్యలను ప్రతిబింబించేలా వార్తలను సమగ్రంగా ప్రచురించడం ద్వారా ఈ పత్రిక ప్రజల నమ్మకాన్ని పొందిందని, స్థానిక సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో నీలగిరి ఎక్స్‌ప్రెస్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సామాజిక సమస్యలు, ప్రజా సంక్షేమం వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుని వార్తలను అందించే నీలగిరి ఎక్స్‌ప్రెస్ ప్రజల గొంతుకగా నిలుస్తోందని అభినందించారు.

# కార్పోరేటర్ పాడే మోసిన ఆచారి





**ఆమనగల్లు, జనవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
చంపాపేట్ డివిజన్ బిజెపి కార్పోరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి అనారోగ్యంతో ఆసుపత్రిలో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం తెలిపారు. అనంతరం పాడే మోసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ మాజీ శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు కాసుల వెంకటేష్ , నాయకులు, బిజెపి పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించండి

**చొప్పదండి, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చొప్పదండి మున్సిపాలిటీని బీజేపీకి అప్పగిస్తే పట్టణ రూపురేఖలు మారుస్తామని, అభివృద్ధి ఏంటో చూపిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. చొప్పదండి పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.మున్సిపాలిటీల అభివృద్ధి పట్ల గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయని, జరగబోయే ఎన్నికల్లో ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ఒక్క పైసా కూడా ఇవ్వలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పట్టణాల అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తోందని, అమృత్ స్కీమ్ ద్వారా పట్టణాలను చేర్చిందని, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు స్మార్ట్ సిటీ హోదా ఇచ్చి వేల కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. మున్సిపాలిటీల అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమని, కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ సహకారంతో పట్టణాలను అభివృద్ధి చేసే బాధ్యత బీజేపీ




తీసుకుంటుందని అన్నారు.ప్రజలు బిఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై విసిగిపోయి ఉన్నారని, నేడు అందరూ బీజేపీ వైపు చూస్తున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ మున్సిపాలిటీలపై, కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరవేస్తామని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చిల్ల శ్రావణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కిషన్ మోర్చా ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు మొగిలి మహేష్, పట్టణ నాయకులు గుండేటి వెంకటరమణ, రాజన్నల రాజు, సంగ నరేష్, జిట్టా కుమార్, గుండేటి శివ, సంబోజీ సాయి, వడ్లూరి సుధాకర్, సార్ల కనకయ్య, అనుకరి సాయికృష్ణ, గుర్రం సమర్, చల్ల అనూష్, తాడూరి రామకృష్ణ, తోట కోటేష్, గొల్ల గట్టయ్య తదితరులు పాల్గొన్నారు

# ఓటే మన వజ్రాయుధం

## ధనపురి సాగర్



**కరీంనగర్, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా హోమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 36వ డివిజన్ మారుతినగర్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. “నేను తప్పక ఓటు వేస్తాను, మీరు కూడా వేయండిడ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, నీ ఓటే ఒక ప్రశ్నించే గొంతుక కావాలి” అనే నినాదంతో ముద్రించిన వాల్ పోస్టర్‌ను సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఓటర్ ప్రతిజ్ఞ చేసిన తర్వాత సాగర్ మాట్లాడుతూ రాజ్యాంగం మనకు కల్పించిన వజ్రాయుధం ఓటు అని, ఆ హక్కును బాధ్యతాయుతంగా వినియోగించి నీతి, నిజాయితీతో సుపరిపాలన అందించే నాయకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఓటు శాతం పెంచేందుకు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో తిరుపతి, ఉదయ్ దేవి శ్రీ ప్రసాద్, మెతుకు రజనీకాంత్, బిజెపి సీనియర్ నాయకులు చింతల ప్రభాకర్, పోరెడ్డి శ్రీధర్, తోట అనిల్, కరుణాకర్, గణేష్ యువకులు పాల్గొన్నారు.

# ఘనంగా రథసప్తమి వేడుకలు



**గంగాధర ,జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ (పత్తి కుంటపల్లి)లో శ్రీ కోదండ సీతారామస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో అభిషేకం, హోమం, భజన కార్యక్రమాలు నిర్వహించగా, అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తుల ఉత్సాహంతో విశిష్టంగా సాగాయి.

# కలెక్టర్ పమేలా సత్పతికి అరుదైన గౌరవం

**కరీంనగర్ ,జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి వేడుకల్లో కరీంనగర్ జిల్లాకు మరో విశిష్ట గౌరవం లభించింది. ఎన్నికల నిర్వహణలో వినూత్న ఓటర్ల అవగాహన కార్యక్రమాలు, శిక్షణ, సామర్థ్యాభివృద్ధి రంగంలో చేసిన కృషికి గాను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా కలెక్టర్ ఈ అవార్డును స్వీకరించారు. కలెక్టర్ పమేలా సత్పతి మార్గదర్శకత్వంలో ఎన్నికల అధికారులు, సహాయక అధికారులు, పోలింగ్ సిబ్బంది, పరిశీలకులకు




శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించడం, సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరచడం, పారదర్శకతతో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టడం ఈ అవార్డుకు ప్రధాన కారణమైంది.అలాగే వినూత్న ఓటర్ల అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజాస్వామ్యంపై ప్రజల్లో నమ్మకం పెంపొందించడంలో జిల్లా ఎన్నికల యంత్రాంగం విశేషంగా కృషి చేసింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా యంత్రాంగం, ఎన్నికల అధికారులు, సిబ్బంది అందరి సమష్టి కృషి వల్లే ఈ అవార్డు సాధ్యమైంది అని పేర్కొన్నారు.జిల్లా ఎన్నికల యంత్రాంగం ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి, సుశిక్షిత సిబ్బందితో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించగల సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోందని అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

# నీలగిరి ఎక్స్‌ప్రెస్ 2026 క్యాలెండర్ ఆవిష్కరణ





## ప్రజలకుప్రజాప్రతినిధులకు వారధిగా పత్రికలు పనిచేయాలి- ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**వనపర్తి,జనవరి 25( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** వనపర్తి పట్టణంలోని తన స్వగృహం నంది హిల్స్లో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి నీలగిరి ఎక్స్‌ప్రెస్ (చైతన్య గళం) దినపత్రిక వారు రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డి మాట్లాడుతూ, నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో ప్రచురితమయ్యే వార్తలను తాను సమయం దొరికినప్పుడల్లా పరిశీలిస్తుంటానని తెలిపారు. వార్తలు సరళమైన భాషలో, స్పష్టంగా, ప్రజలకు అర్థమయ్యే విధంగా రాస్తుండటం అభినందనీయమని అన్నారు.పత్రికలు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు మధ్య వారధిగా పనిచేయాలని పేర్కొన్నారు. కొత్తగా ఫీల్డ్‌లోకి వచ్చినప్పటికీ నీలగిరి ఎక్స్‌ప్రెస్ అనతి కాలంలోనే మంచి పేరు సంపాదించిందని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఈ పత్రిక ప్రజాసేవలో ముందుండి మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి గంగవరం రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్కాకుల సతీష్, నీలగిరి ఎక్స్‌ప్రెస్ టౌన్ రిపోర్టర్ రాంరెడ్డి, కొల్లాపూర్ రిపోర్టర్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# వంగా మధుసూదన్ రెడ్డి మృతి పట్ల ఉప్పల నివాళులు



**చంపాపేట్, జనవరి 25(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చంపాపేట్ డివిజన్ కార్పొరేటర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంగా మధుసూదన్ రెడ్డి అకాల మరణం దిగ్భ్రాంతికరమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు.ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూ, సమాజసేవలో నిమగ్నమైన నాయకుడిని కోల్పోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం ఆయన నివాసంలో పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

# మదుసుదన్ రెడ్డి మృతి పట్ల మంత్రి నివాళులు



**చంపాపేట్, జనవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):** చంపాపేట్ డివిజన్ కార్పొరేటర్ వంగ మదుసుదన్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆయన స్వగృహానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి - తహసిల్దార్ యాకన్న


**ఎలిగేడు, జనవరి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మండలం కేంద్రంలో ఆదివారం 16వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎలిగేడు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ యాకన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని,18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనదని పేర్కొంటూ పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈమేరకు సీనియర్ సిటిజన్లను సన్మానించి గౌరవం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఆర్ఐ



జయలక్ష్మి, గ్రామపంచాయతీ కార్యదర్శి అంజలి, ఉప సర్పంచ్ ముంజం నరేష్, వార్డు సభ్యులు మామిడాల రమేష్, మధుకర్, సాయి, నరేందర్, రాకేష్, రమేష్, శ్రీనివాస్‌లతో పాటు అధిక సంఖ్యలో యువకులు, మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలి

భారతదేశం బ్రిటిష్ పాలన నుండి విముక్తి పొందిన తర్వాత స్వతంత్ర పరిపాలన వ్యవస్థ కొరకు 1930 సంవత్సరంలో ఇదే రోజున భారత జాతీయ కాంగ్రెస్ పూర్ణ స్వరాజ్ ప్రకటించిన రోజు జ్ఞాపకార్థంగా 26 జనవరి నాడు 77వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం రాజ్యాంగబద్ధమైన పాలన ఈరోజు నుండి ప్రారంభమైంది . భారతదేశంలో ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగా అవతరించిన రోజు. ప్రజలకు సార్వభౌమాధికారం స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం రాజ్యాంగం పీఠికలో పొంద పరచడం జరిగింది. ఈరోజు రాజ్యాంగ విలువల గురించి స్మరించుకుంటారు. బ్రిటిష్ పరిపాలన చట్టాల స్థానంలో
సొంత పాలన ప్రారంభమైంది.




**2026 సంవత్సరం గణతంత్ర దినోత్సవ యొక్క థీమ్**

వందేమాతరం ఆత్మనిర్భర్ భారత్ ఇతివృత్తంగా నిర్వహించడం జరుగుతుంది. 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం వందేమాతర గీతం జాతి విముక్తి పై కలిగించిన ప్రభావాన్ని రిపబ్లిక్ డే లో ప్రత్యేకంగా ప్రదర్శిస్తారు

**ప్రజాస్వామ్య స్ఫూర్తి** ప్రజలే ప్రభువులు అన్న సూత్రంతో అధికార పీఠం అత్యున్నత స్థానంప్రజలకు( ఓటర్లకు) రాజ్యాంగంలో ఇవ్వడం జరిగింది ప్రజాస్వామిక విధానాలే దేశానికి శరణ్యం. రాజ్యాంగం ప్రజాస్వామ్య స్ఫూర్తికి పునాదిగా నిలిచింది.

**రాజ్యాంగం పై అవగాహన కల్పించాలి**

ప్రభుత్వం విద్యా సంస్థల్లో ప్రాథమిక స్థాయి నుండి 'పీ'జీ స్థాయి వరకు రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టి రాజ్యాంగంపై అవగాహన కలిగించాలి. భారత రాజ్యాంగం ఉనికిలోకి వచ్చి77 సం" రాల సందర్భంగా గణతంత్ర దినోత్సవం జరుపు కుంటున్నప్పటికి జన బాహుళ్యంలోకి రాజ్యాంగం గురించి ప్రచారం చేయడం అవగాహన కల్పించడంలో కేంద్ర 'రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనాయి.

**హక్కులు పరిపాలన చట్టాల మీధ అవగాహన కల్పించాలి**

రాజ్యాంగంలోని అంశాలు స్థానిక' రాష్ట్ర :కేంద్ర ప్రభుత్వాల ఏర్పాటు పరిపాలన చట్టాలు మానవ హక్కులు'ప్రాథమిక హక్కులు ఆదేశిక సూత్రాలు రాష్ట్ర' కేంద్ర జాబితా ఉమ్మడి జాబితాలోని అంశాలుమరియు సూక్ష్మ స్థూల స్థాయి ఆర్థిక ప్రణాళికల అమలు అధికార వికేంద్రీకరణ మొదలగు అంశాల పై అవగాహన చైతన్యం కలిగించాలి. సామాజిక భద్రత చట్టాలపట్ల ప్రజలకు అవగాహన కలిగించే ప్రయత్నం జరుగలేదు.

రాజ్యాంగం బ్రహ్మ పదార్థం రాజ్యాంగం అంటే ఎవ్వరికీ అర్థం కాని బ్రహ్మపదార్థం ఐయ్యింది.రాజ్యాంగ మంటే ఆంభేడ్కర్ రచించాడు అని మాత్రమే చాలా మందికి తెలుసు. రాజ్యాంగాన్ని ఉచితంగా పంపిణీ చెయ్యాలి రోడు మీద! భగవత్గీత' బైబిల్' కురాన్ మత గ్రంథాలను ఉచితంగా లేదా తక్కువ ధరలకు అమ్మి నట్లు రాజ్యాంగాన్ని వాడుక బాషలో ప్రింట్ చేసి ప్రజలకు ఉచితంగా పంచిపెట్టాలి. మీడియా కళారూపాల ద్వారా అవగాహన కల్పించాలి

విద్యాసంస్థల్లో కళాశాలలో రాజ్యాంగ పట్ల అవగాహన చైతన్య సదస్సులు చర్చా గోస్టులు నిర్వహించాలి .వివిధ సామాజికమాధ్యమాలద్వారా కళారూపాల ద్వారా వాడుక బాషలో నాటకాల ప్రదర్శన ద్వారా గ్రామీణులకు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగించాలి.

ఇటీవల రాజ్యాంగం మార్చాలని రద్దుచేయాలని కొత్త రాజ్యాంగం రూపొందించాలని జాతీయ స్థాయిలోచర్చలు వాదోపవాదాలు జరుగుతున్నాయి.

**రాజ్యాంగబద్ధమైన పాలన విఫలం**

78 సం" రాల స్వాతంత్ర్య చరిత్ర లో అధికారంలో వున్న పార్టీలు ప్రభుత్వాలు రాజ్యాంగ బద్దంగా పాలనా వ్యవహారాలను నిర్వహిస్తే
ఆశించిన ప్రజా సంక్షేమం సామాజిక ఆర్థిక ప్రగతి సిద్దించేది. నిజానికి రాజ్యాంగం గురించి తెలిస్తే ప్రజలు పాలకులను ప్రభుత్వ అధికారులను ప్రశ్నిస్తారు.

సుపరిపాలన లో వైఫల్యం రాజకీయ పార్టీలు అధికారంలో వున్న ప్రభుత్వాలకుపాలకులలో/
పారదర్శకనికత జవాబు దారీతనం లోపించింది . మాయమాటలతో ప్రజల దృష్టి మళ్లించడం ప్రజలు ప్రశ్నిస్తారనే నెపంతో పాలకులు ప్రజలవద్దకు సుపరి పాలన అందిచడంలో విఫలకావడం శోచనీయం. ప్రజాస మస్యల పరిష్కారదిశగా దృష్టి పెట్టకుండా
ప్రజలను మాయ మాటల ప్రపంచం లోకి నెట్టి వేస్తూ కాలయాపన చేస్తున్నారు.దేశంలో
కొంత మంది మేధావులకు మాత్రమేరాజ్యాంగం మీద అవగాహన వుంది..దేశంలోరాజ్యాంగంపై సంపూర్ణ అవగాహనవున్న
అడ్వకేట్స్ సంఖ్య కొద్దిగానే వుంది. రాజ్యాంగం పై శిక్షణ ఇవ్వాలి రాజకీయ పార్టీలు తమ కార్యకర్తలకు రాజ్యాంగం చట్టాల పట్ల.శిక్షణ అవగాహన తరగతులు నిర్వహించాలి . రాజ్యాంగ పరిజ్ఞానం వున్న అభ్యర్థులకు ఎన్నికల్లో టికెట్లు ఇవ్వాలి .

**జాతీయ స్థాయిలో అర్హత పరీక్ష నిర్వహించాలి**

జాతీయ స్థాయిలో పొలిటికల్ సర్వీస్ కమీషన్ ఏర్పాటు చేసిఆల్ ఇండియా స్థాయిలో రాజకీయాల్లో ప్రవేశించే అభ్యర్థులకు ఎలిజిబిలిటీ పరీక్ష నిర్వహించాలి. (లాసెట్ ఎంసెట్ మాదిరి) అర్హత పరీక్షలో పాసైన అభ్యర్థులు మాత్రమే చట్టసభలకు సభ్యులుగా పోటీ చేసేట్లు రాజ్యాంగాన్ని సవరించాలి.


**కుటుంబమే రాజ్యాంగ అవగాహనకు కేంద్రం కావాలి**

ప్రతి కుటుంబాన్ని యూనిట్ గా తీసుకోనితల్లి తండ్రులు తమ పిల్లలకు రాజ్యాంగం మీద అవగాహనకలిగించాలి

**విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి**

ప్రభుత్వం విద్యాసంస్థల్లో కళాశాలల్లో యూనివర్సిటీల్లో
విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి. విద్యార్థి దశలోనే ప్రజాస్వామ్యం రాజ్యాంగం మానవ హక్కులు విధులు ప్రజాస్వామ్య ప్రక్రియ పైన అవగాహన చైతన్యం కలిగించాలి. విద్యార్థి రాజకీయాల్లో రాణించిన వారు జాతీయ స్థాయి నాయకులుగా ఎదిగి ప్రజా సేవలో తరించి ఆదర్శ రాజకీయాలకు స్ఫూర్తిగానిలుస్తారు.రాజకీయసైద్ధాంతికనాయకత్వ మున్న ప్రజా ప్రతినిధులు తయారవుతారు
రాజ్యాంగ లక్ష్యాల సాధనకు అవసరమైన పరిజ్ఞానాన్ని పుణికి పుచ్చు కుంటారు.ప్రభుత్వం కే 'జీ టు పి'జి వరకు రాజ్యాంగాన్ని కంపల్సరీపాఠ్యాంశంగాప్రవేశపెట్టాలి.

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
మాజీ కరెస్పాండెంట్
జస్టిస్ కుమారయ్య లా కాలేజీ
(ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్
జస్టిస్ జస్టిస్ కుమారయ్య 1969
1971)
కరీంనగర్
9440245771



# మిరాసిపల్లి గ్రామంలో ఓటర్స్ దినోత్సవం కార్యక్రమం



**కొత్తకోట జనవరి 25( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
ఓటు అనేది కేవలం ఒక హక్కు మాత్రమే కాదు, ప్రజాస్వామ్య విలువలను కాపాడే ప్రతి పౌరుని బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. ఓటర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మిరాసిపల్లి గ్రామంలో ఓటర్ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన యువతీ యువకులు అందరూ నూతన ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ వైదిహి (మాధవి) ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, యువత ఓటర్ నమోదు చేసుకుని ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని ప్రతి ఒక్కరి సమస్యలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, యూనిక్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. నిష్పక్షపాతమైన గ్రామ పాలన అందించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని ఓటర్ నమోదు ప్రక్రియపై ఆసక్తి చూపించారు.

# వనపర్తిలో శ్రీకృష్ణ ఆలయం- ఎమ్మెల్యే

**యాదవ సంఘ భవనం పై అంతస్తు నిర్మాణానికి 10 లక్షలు ఎమ్మెల్యే మేఘారెడ్డి**



**వనపర్తి జనవరి 25( నీలగిరి ఎక్స్ ప్రెస్)::**
రూ.10 లక్షల వ్యయంతో జంగిడిపురం లోని యాదవ కమ్యూనిటీ హాల్ పై అంతస్తు నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి త్వరలోనే వనపర్తి పట్టణ నడిబొడ్డున శ్రీకృష్ణ ఆలయ నిర్మాణం చేపట్టేందుకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. జంగిడిపురం లోని యాదవ కమ్యూనిటీ హాల్ కు సంబంధించి పై అంతస్తు నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రత్యేక నిధుల నుంచి రూ. 10 లక్షలు మంజూరు చేసిన సందర్భంగా ఆదివారం నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గ పరిధిలోని యాదవుల అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గొల్ల వెంకటయ్య, న్యాయవాది మోహన్ యాదవ్, వనపర్తి పట్టణ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, కౌన్సిలర్లు, ఎల్ఐసి కృష్ణ, నక్క రాములు, జంపన్న, రవి యాదవ్, నాగేంద్ర యాదవ్, రాముడు యాదవ్ యాదవ కమ్యూనిటీ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ



**కరీంనగర్ ,జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మున్సిపల్ కార్పొరేషన్ 64వ డివిజన్ ముకరంపురలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. అలాగే ఏసి మెకానిక్ అసోసియేషన్ వారి డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.కార్యక్రమానికి కరీంనగర్ అర్బన్ ప్రజలు, డివిజన్ వాసులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేశారు.

# మయూరి సింగ్‌తో మహిళా కాంగ్రెస్ సమావేశం

**హైదరాబాద్, జనవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హైదరాబాద్ గోల్కొండ హోటల్‌లో ఆదివారం ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇంచార్జి శ్రీమతి మయూరి సింగ్‌ను రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి మొగలి సునీత రావుతో కలిసి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి చింతల నిర్మల రెడ్డి పూల బొకేతో సత్కరించారు.ఈ సందర్భంగా నిర్మల రెడ్డి మాట్లాడుతూ, తాను సూర్యాపేట, సిద్ధిపేట జిల్లాల మహిళా కాంగ్రెస్ ఇంచార్జిగా ప్రతినిత్యం నిర్వహిస్తున్న రివ్యూ మీటింగ్స్, కార్యక్రమాల వివరాలు, అలాగే మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ



పథకాల అమలు విధానాన్ని మయూరి సింగ్‌కు వివరించి అందజేశానని తెలిపారు. అనంతరం సునీత రావు, మయూరి సింగ్‌లను దుసెల్వాతో సత్కరించారు.నిర్మల వివరించిన అంశాలపై మయూరి సింగ్ సానుకూలంగా స్పందించి, వాటిని అల్కలాంబ దృష్టికి తీసుకువెళ్లి వివరించనున్నట్లు భరోసా ఇచ్చారు. మహిళా కాంగ్రెస్ గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం అయ్యేలా కృషి చేయాలని సూచించారు.

# బచ్చు రాముకు బూసా ఫిలిం అవార్డు అందజేత




**వనపర్తి టౌన్,జనవరి 25( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
ప్రజలకు అందుబాటులో ఉంటూ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు వనపర్తి పట్టణానికి చెందిన బచ్చు రామును బూసా విజేత ఫిలిం అవార్డుకు ఎంపిక చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఎల్. ప్రసాద్ స్టూడియోలో నిర్వహించిన బూసా విజేత అవార్డ్స్ కార్యక్రమంలో సినీ నటుడు బాబు మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని బచ్చు రాముకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా బచ్చు రాము మాట్లాడుతూ, వనపర్తి మున్సిపల్ కార్మికులకు ఆర్థిక సహాయం, ప్రమాద సమయంలో కుటుంబాలను ఆదుకోవడం, కరోనా సమయంలో భోజనాల పంపిణీ, ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలకు ఉచిత టాయిలెట్ల ఏర్పాటుకు కృషి, పాత బస్టాండ్ అభివృద్ధి, తిరుమలనాథ స్వామి దేవాలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే వినతులు, స్మశాన వాటిక విస్తరణ కోసం చేసిన ప్రయత్నాలు, అవసర సమయంలో కుటుంబాలకు ఆర్థిక సహాయం వంటి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. తన సేవలను గుర్తించి అవార్డు అందజేయడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. ఈ సందర్భంగా బాబు మోహన్‌తో పాటు సినీ నటుడు బ్రహ్మానందం బచ్చు రామును అభినందించారు.

## దేశమా నీకు ఇదే వందనం

దేశమా నీకు ఇదే వందనం
గణతంత్ర మా నీకు ఘన స్వాగతం
ఈ దేశం నాది ఈ రాజ్యం నాది అని ప్రతి పౌరుడుకి ఉండాలి
ప్రతి పౌరుడు సైనికుల పోరాడాలి!!

మూడు రంగుల జెండా మురిసిపోవాలి
భారతీయులంతా కలసి రావాలి
గణతంత్ర దినోత్సవ సంబరాలలో
మన దేశ ఖ్యాతి దిగంతాలు దాటాలే!!

నాటి నేతల స్ఫూర్తిని పునికి పుచ్చుకోవాలి
అభివృద్ధి బాటలో అడుగులు వేయాలి
భారతావని గుండెల్లో వెలుగులు నింపాలి
విజ్ఞాన గనిగా నింగినంటాలి
నా భారతదేశం!!

రచన :-
దేవులపల్లి రమేశ్
కలం: శ్రీ వర్ష
నంగునూర్,సిద్దిపేట
9963701294



# ముషీరాబాద్ ఆర్యవైశ్య హాస్టల్ కార్యవర్గంలో జిల్లా వాసి

**కరీంనగర్, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
ముషీరాబాద్ ఆర్యవైశ్య హాస్టల్ కార్యవర్గ సభ్యునిగా కొమరవెల్లి వెంకటేశం నియమితులయ్యారు. వైస్ హాస్టల్ అధ్యక్షుడు గంజి రాజమౌళి గుప్తా ఆయనకు




నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి కార్యవర్గ సభ్యునిగా నియమించినందుకు గంజి రాజమౌళి గుప్తాకు, నియామకానికి సహకరించిన గంజి స్వరాజ్యబాబుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వైశ్య నాయకులు ఆయన నియామకాన్ని హర్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# సమ్మక్క సారలమ్మ జాతరలో పకడ్బందీ ఏర్పాట్లు అవసరం

- రాజేందర్ రావు

**కొత్తపల్లి, రేకుర్తి జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రేకుర్తి సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు సూచించారు. ఆదివారం రేకుర్తిలో జరిగిన జాతర సందర్భంగా ఆయన అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గద్దెల వద్ద మొక్కలు చెల్లించుకుని, జాతర ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు మున్సిపల్ కమిషనర్‌తో



మాట్లాడతానని, జాతర విజయవంతం కావడానికి స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు ముందుండి పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. సమ్మక్క సారలమ్మ దీవెనలు ఎల్లప్పుడూ కరీంనగర్ ప్రజలపై ఉండాలని, రాబోయే రోజుల్లో జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపే శక్తి అమ్మవార్ల ఆశీస్సుల వల్లే సాధ్యమవుతుందని రాజేందర్ రావు ఆకాంక్షించారు. జాతర కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో 19వ డివిజన్ అధ్యక్షుడు అస్తపురం దీక్షిత్, స్థానిక నాయకులు దుర్గం సుధీర్ కుమార్, దుర్గం శేఖర్, 20వ డివిజన్ అధ్యక్షుడు అస్తపురం రమేష్, ఇంచార్జ్ అస్తపురం తిరుమల, అక్కపెల్లి మల్లేశం, హస్తపురం కొమురయ్య, చంటి మహేష్, గంగిపల్లి సంపత్, గోనే సురేష్, లింగంపల్లి లక్ష్మయ్య, జాడి అశోక్, హేమంత్, అస్తపురం రాజయ్యతో పాటు గ్రామ పెద్దలు, యువ సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో రథసప్తమి వేడుకలు

**కరీంనగర్, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ పాత మార్కెట్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రథసప్తమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సూర్యప్రభ వాహనసేవలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో మాజీ మంత్రి ప్రారంభించిన ఈ ఉత్సవాలను ప్రభుత్వం కొనసాగిస్తోందని, రాజకీయాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో ఈ వేడుకలు జరుగుతున్నాయని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో దాతల సహకారంతో పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లపై మాట్లాడుతూ, జనవరి 28 నుంచి 31 వరకు జరిగే జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా శాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్తర తెలంగాణలోని కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని 51 కేంద్రాల నుంచి బస్సులు ఏర్పాటు చేసినట్లు,



మొత్తం 4 వేల ఆర్టీసీ బస్సులు జాతర కోసం నడుస్తాయని వివరించారు. భక్తులు సురక్షితంగా ప్రయాణించేందుకు ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలని సూచించారు. జాతరకు వచ్చే పిల్లలు తప్పిపోకుండా ఉండేందుకు పోలీస్ శాఖ క్యూ ఆర్ కోడ్ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఫోన్ ట్యాపింగ్, మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లపై మాట్లాడుతూ, ప్రభుత్వం ఎవరిపై కక్షపూరితంగా వ్యవహరించడం లేదని, చట్టం తన పని తాను చేసుకుంటుందని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల విషయంలో ప్రజా ప్రతినిధుల ప్రమేయం ఉండదని, అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో అందరూ సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ డిమాండ్

**కరీంనగర్ ,జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ విద్యాశాఖ స్పష్టమైన ఆదేశాలు, నిబంధనలు ఉన్నప్పటికీ అనేక ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ముందస్తు అడ్మిషన్ల పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (యూఎస్ఎఫ్ఐ) కరీంనగర్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. అడ్మిషన్ షెడ్యూల్ విడుదల కాకముందే లక్షల రూపాయల ఫీజులు వసూలు చేయడం, సీట్లు అయిపోతాయి, తర్వాత అడ్మిషన్ ఉండదు అంటూ భయపెట్టి ఒత్తిడి తెచ్చడం పూర్తిగా అక్రమమని పేర్కొంది. ఈ విధానం విద్యను వ్యాపారంగా మార్చి, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని యూఎస్ఎఫ్ఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. ముందస్తు అడ్మిషన్ల వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు




తీవ్రంగా నష్టపోతున్నారని, అప్పులు చేసి ఫీజులు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపింది. ప్రభుత్వం మౌనంగా ఉండటం బాధాకరమని, జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరచి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. జిల్లా వ్యాప్తంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న విద్యాసంస్థలను గుర్తించి వెంటనే మూసివేయాలని, అక్రమంగా వసూలు చేసిన ఫీజులను విద్యార్థులకు తిరిగి చెల్లించాలని యూఎస్ఎఫ్ఐ కోరింది. విద్యా హక్కును కాపాడేందుకు నిరంతరం పోరాటం చేస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించింది. తల్లిదండ్రులు, విద్యార్థులు ముందస్తు అడ్మిషన్ల మాయలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. విద్య వ్యాపారీకరణకు వ్యతిరేకంగా యూఎస్ఎఫ్ఐ పోరాటం ఆగదని స్పష్టంగా ప్రకటించింది. ఈ కార్యక్రమంలో బుస మనితేజ, అభిలాష్, జీవన్, శన్విత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథిగా ఉర్సులా వాన్ డెర్ లేయన్

**న్యూఢిల్లీ,జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు నేడు జరగనున్నాయి. ఈ వేడుకల్లో యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్‌తోపాటు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో లూయిస్ శాంటోస్ డా కోస్టా ముఖ్య అతిథులుగా పాల్గొనున్నారు. ఇప్పటికే వీరు భారత్ చేరుకున్నారు. న్యూఢిల్లీ ఎయిర్ పోర్టులో వీరికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద ఘన స్వాగతం పలికారు. జనవరి



27న జరగనున్న16వ భారత్, ఈయూ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీతో కలిసి వీరు పాల్గొననున్నారు. భారత పర్యటనలో భాగంగా వీరు.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశం కానున్నారు. మరోవైపు ఈ గణతంత్ర వేడుకలకు ఢిల్లీలోని కర్తవ్య పథ్ ఇప్పటికే ముస్తాబు అయింది. ప్రతి ఏటా జనవరి 26వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఏదో ఒక దేశానికి చెందిన ప్రముఖులు హాజరవుతూ వస్తున్న విషయం విదితమే.

# టెట్ రద్దు కోసం చలో ఢిల్లీ ధర్నా విజయవంతం చేయాలి




**కరీంనగర్, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పిఆర్టియు టీఎస్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో తిరుమల్ నగర్ కార్యాలయంలో అత్యవసర సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షులు ఐలేని కరుణాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఫిబ్రవరి 5న ఢిల్లీలో జంతర్మంతర్ వద్ద అఖిలభారత ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో ఢిల్లీ ధర్నా విజయవంతం చేయాలని నిర్ణయించారు. కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ, సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ తప్పనిసరి చేస్తూ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇంప్లీడ్ కావాలని రాష్ట్ర శాఖ ద్వారా ప్రాతినిధ్యం చేసినట్లు తెలిపారు. అలాగే ఆర్‌టీఈ2009 యాక్ట్‌లో సవరణ చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి కూడా టెట్ రద్దు కోసం గళం విప్పినా ప్రభుత్వాలు స్పందించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మరి జయపాల్ రెడ్డి మాట్లాడుతూ, జీఓ నెంబర్ 25ను సవరించి రాబోయే విద్యా సంవత్సరంలో రేషనలైజేషన్ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చిట్నేని శ్రీకాంత్ రావును అకాడమిక్ గైడెన్స్ కమిటీ సభ్యునిగా ఎన్నికైనందుకు జిల్లా శాఖ తరఫున సన్మానించారు. శ్రీకాంత్ రావు తన నియామకానికి ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి, రాష్ట్ర సంఘ నాయకులు పులగం దామోదర్ రెడ్డి, సుంకరి బిక్షం గౌడ్, వంగ మహేందర్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎం. తిరుపతి రెడ్డి, వేముల మహిపాల్ రెడ్డి, దొమ్మాట కృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ముజీబ్, మానకొండూరు మండల అధ్యక్షుడు కేతిరి జీవన్ రెడ్డి, సీనియర్ సభ్యులు అంజద్, పత్రిక సంపాదక వర్గ సభ్యులు జమీల్, సోషల్ మీడియా కమిటీ సభ్యుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ చెరువు పునరుద్ధరణకు శంకుస్థాపన



**హుస్నాబాద్, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**

: హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు మత్తడి కాలువల పునరుద్ధరణ పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.2.74 కోట్లతో ఈ పనులు చేపట్టనున్నట్లు ప్రకటించారు. గత వర్షాల కారణంగా దెబ్బతిన్న చెరువు మత్తడి పరిస్థితిని మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, ఈఈ రాములు, ఎస్సీ సుమతి తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ సుమతి మాట్లాడుతూ, ప్రతిపాదనలు పంపగానే మంత్రి వెంటనే స్పందించి రూ.2.7 కోట్ల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. ఆయకట్టు కింద 1500 ఎకరాలు సాగు అవుతాయని, దెబ్బతిన్న మత్తడి పనులతో పాటు చెరువులోని మూడు తూముల షెట్టర్ల పనులు కూడా చేపడతామని చెప్పారు. జంగిల్ క్లియరెన్స్, సిల్ట్ క్లియరెన్స్ పనులు వేగంగా పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు.

# పోలీస్ కమిషనరేట్‌లో వార్షిక డీ-మొబిలైజేషన్ పరేడ్



**కరీంనగర్, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం వార్షిక డీ-మొబిలైజేషన్ పరేడ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపిఎస్ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించి పరేడ్‌ను పర్యవేక్షించారు. సిపి గౌష్ ఆలం మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా పోలీస్ సిబ్బందికి వృత్తిపరమైన శిక్షణ పునరుద్ధరించబడుతుందని, బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ అనంతరం ఇలాంటి శిక్షణా తరగతులు నైపుణ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గత నాలుగు వారాలుగా జరిగిన శిక్షణలో తుపాకుల వినియోగం, మెయింటెనెన్స్, ఖైదీల రవాణా సమయంలో పాటించాల్సిన భద్రతా నియమాలు, పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ బాధ్యతలు, అత్యవసర సమయాల్లో ఫైరింగ్ విధానంపై ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వబడిందని వివరించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందిస్తూ, ఇటువంటి క్రమశిక్షణతో కూడిన శిక్షణలు పోలీసు వ్యవస్థ పటిష్టతకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఆర్.ఐ. పరిపాలన రజినీకాంత్‌తో పాటు కమిషనరేట్ పరిధిలోని పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డిప్యూటీ తాసిల్దార్ నుంచి ఐఏఎస్



**కరీంనగర్, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

డిప్యూటీ తాసిల్దార్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగి అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) స్థాయి దాటి ప్రతిష్టాత్మక ఐఏఎస్ హోదా సాధించిన గాజుల శ్యాం ప్రసాద్ లాల్‌కు కరీంనగర్ జిల్లాలో ఘన సన్మానం జరిగింది. టీఎన్జీవోటీజీవో ఆధ్వర్యంలో స్థానిక ఫిలిం భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను గజమాలలు, శాలువాలతో సత్కరించారు. ఉద్యోగ సంఘాల నాయకులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, డిప్యూటీ తాసిల్దార్ నుంచి ఐఏఎస్ హోదా వరకు ఎదగడం కరీంనగర్ జిల్లాకే గర్వకారణమని అన్నారు. ప్రజలకు, ఉద్యోగులకు ఆపద్బాంధవుడిగా సేవలందించిన ఆయన అందరికీ ఐకాన్‌గా, లెజెండరీ నాయకుడిగా నిలిచారని కొనియాడారు. ఎంత పెద్ద స్థాయికి చేరినా తన మూలాలను, తన జిల్లాను మరవకుండా అందరివాడిలా ఉంటూ అందరి మనసులు గెలుచుకున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో దారం శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణరావు, మడిపల్లి కాళీ చరణ్, ముప్పిడి కిరణ్ కుమార్, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్ రెడ్డి, గంగారపు రమేష్, ఒంటెల రవీందర్ రెడ్డి, సందీప్ రావు, నాగుల అనిల్, పూర్ణచందర్ రెడ్డి, సత్యం, కొండల్ రెడ్డి, రామ్మోహన్, మహేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నరసన్నతో పాటు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు వెంకట్రెడ్డి, విజయ్ మరియు పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్ పీఠంపై తెలంగాణ జాగృతి గురి



**పెద్దపల్లి జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: పెద్దపల్లి జిల్లాలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి కీలక పాత్ర పోషించబోతుందని రాష్ట్ర కార్యదర్శి బండారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీలలో ప్రజల ఆశీర్వాదంతో చైర్మన్ పదవిని ఖచ్చితంగా కైవసం చేసుకుంటుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పోరాటం, ప్రజా సమస్యలపై నిరంతర కృషి కారణంగా జాగృతి నాయకత్వాన్ని ప్రజలు ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే పాలన, పారదర్శకత, అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. మున్సిపల్ స్థాయిలో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం, నిరుద్యోగ యువతకు అవకాశాలు వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణతో ఎన్నికల బరిలోకి దిగుతామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో ఘన విజయం సాధించి చైర్మన్ పీఠాన్ని అధిరోహిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# వైభవంగా శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**కరీంనగర్ జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

గీత భక్త సమాజం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. వసంతపంచమి రోజు సరస్వతి మాత ప్రార్థనతో ప్రారంభించి గీత పారాయణం కొనసాగింది. జనవరి 23న మొదటి ఆరు అధ్యాయాలు, 24న ఏడవ నుండి పన్నెండవ అధ్యాయాలు, రథసప్తమి సందర్భంగా ఆదిత్య హృదయం, సూర్య నమస్కారం అనంతరం గీత 12 నుండి 18 అధ్యాయాలు పారాయణం చేసి సంపూర్ణ గీత పారాయణం ముగించారు. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుండి 8.30 వరకు జరిగిన ఈ కార్యక్రమంలో బండ సత్తయ్య అధ్యక్షతన 70 మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. ఉప్పల రామేశం, చిట్టిమెళ్ల దామోదర్, సుదర్శన్ తోడ్పాటు అందించారు.

# అష్టాంగ యోగా సాధనతో ఆరోగ్య భారతం




**పెద్దపల్లి ,జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జూలపల్లి మండల కేంద్రంలో జరుగుతున్న శ్రీకృష్ణ అష్టాంగ యోగ సాధనలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించి యోగా ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆచార్య శ్రీకోటి కళింగరాజు మాట్లాడుతూ యోగ సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని, అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. యోగ సాధనకు వయసుతో సంబంధం లేదని, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలని పిలుపునిచ్చారు. ప్రాచీనమైన భారతీయ యోగా ప్రాముఖ్యతను ప్రపంచం గుర్తించినా మనం మాత్రం అనుసరించడంలో వెనుకబడిపోతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలందరికీ యోగా చేరువ కావాలనే లక్ష్యంతో వచ్చే ఆదివారం జూలపల్లిలో రెండవ శిక్షణ బ్యాచ్ ప్రారంభమవుతుందని, స్థానికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# టెడ్ ఎడ్ టాక్స్‌లో ప్రతిభ కనబరిచిన జెడ్పిహెచ్ఎస్ విద్యార్థిని



**కరీంనగర్ ,జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పాఠశాల విద్యాశాఖ మరియు పారామితా విద్యాసంస్థల ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన టెడ్ ఎడ్ టాక్స్ కార్యక్రమం ఆకట్టుకుంది. జిల్లాలోని ఎనిమిది మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించగా, జెడ్పిహెచ్ఎస్ రుద్రారం పాఠశాల పదవ తరగతి విద్యార్థిని టీ. ప్రణయ ప్రత్యేకంగా మెప్పించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు రామడుగు మండల విద్యాధికారి జీపీవీ రంగనాథ శర్మ ఆమెను అభినందించారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, ధైర్యం పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరూ ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. జెడ్పిహెచ్ఎస్ రుద్రారం తరపున ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండలంలోని విద్యావేత్తలు విద్యార్థిని ప్రణయకు అభినందనలు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీలోకి వలసల జోరు



**పెద్దపల్లి, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధి, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు చేస్తున్న ప్రజా సేవకు ఆకర్షితులై మున్సిపల్ పరిధిలోని పలువురు నేతలు, కార్యకర్తలు, మైనారిటీ సోదరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెద్దపల్లి క్యాంపు కార్యాలయంలో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అండగా నిలుస్తుందని అన్నారు. పెద్దపల్లి పట్టణంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, కొత్త బస్సు డిపో, బైపాస్ రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ, కోర్టు భవనం వంటి పలు కార్యక్రమాలు అమలవుతున్నాయని గుర్తు చేశారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ పథకాలు ప్రజలకు చేరుతున్నాయని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## 24వ వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ అభ్యర్థిగా కొట్టే స్వరూప



**పెద్దపల్లి, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి పట్టణం 24వ వార్డు కౌన్సిలర్‌గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొట్టే స్వరూప సదానందం పోటీ చేయనున్నారు. ఆదివారం రూ.81 లక్షల యూడీఐఎఫ్ నిధులతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే విజయరమణరావు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 24వ వార్డులో సిసి రోడ్లు, డ్రైనేజీలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి కొట్టే స్వరూపను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.కొట్టే స్వరూప మాట్లాడుతూ, ఎమ్మెల్యే విజయరమణరావు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు మాజీ కౌన్సిలర్ నూగిళ్ల మల్లన్న సహకారంతో విజయం సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. వార్డు ప్రజలు తనను గెలిపించాలని కోరారు.

## సింగరేణి ఆర్జీ3 ఏరియాలో అక్రమ ఓబి రవాణాపై ఆందోళన



**పెద్దపల్లి ,జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సింగరేణి ఆర్జీ3 ఏరియాలో ఓసిపి1 నుంచి ఏఎల్పి రోడ్డు మీదుగా పన్నూరు సెంటర్ వరకు ఓబి మట్టిని అధిక లోడుతో భారీ వాహనాల్లో రవాణా చేస్తున్నారని కార్మికులు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజంతా వాహనాలు ఇష్టారాజ్యంగా సంచరించడం వల్ల రహదారి ధ్వంసమై, దుమ్ము తీవ్రంగా లేస్తూ ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని వారు తెలిపారు.కార్మికులు, ప్రజలు డ్యూటీ సమయాల్లో రహదారి దాటేందుకు కూడా భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ప్రమాదాల ముప్పు పెరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రజా భద్రతను కాపాడాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ నిర్లక్ష్యం కొనసాగుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు.సమస్య పరిష్కారం లేకపోతే సింగరేణి సి&ఎండీ, విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే కేంద్ర బొగ్గు గని శాఖ మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని హెచ్చరించారు. పరిష్కారం జరగకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మొలుమూరి శ్రీనివాస్, దొంతుల సురేష్, గుండ శంకరయ్య, ఎండి జానీ తదితరులు పాల్గొన్నారు.

# బ్లూ బెల్స్ పాఠశాలలో రోబోటిక్స్, కోడింగ్ ప్రాజెక్టుల ప్రదర్శన




**కరీంనగర్ జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: హనుమాన్ నగర్‌లోని బ్లూ బెల్స్ పాఠశాలలో ఆదివారం యూలో టెక్కీ, రోబోటిక్స్ మరియు స్కిల్ దర్బార్ ప్రాజెక్టుల ప్రదర్శన ఘనంగా జరిగింది. గత రెండు విద్యా సంవత్సరాలుగా కంప్యూటర్ సైన్స్‌ను పాఠ్యాంశంగా చేర్చి విద్యార్థులకు రోబోటిక్స్, కోడింగ్ ప్రోగ్రామ్‌లపై శిక్షణ అందిస్తున్నారు. ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులు కోడింగ్, రోబోటిక్స్‌పై ప్రాథమిక అవగాహనతో పాటు ప్రాక్టికల్ శిక్షణ పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో 350 మందికి పైగా విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు.రోబోటిక్స్ విభాగంలో రోప్ కార్, లైన్ ఫాలోవర్, ఆబ్జెక్ట్ డిటెక్షన్, సర్వో స్వీప్, మాన్యువల్ బూమ్ బారియర్, ఆటోమేటిక్ నైట్ లాంప్ వంటి ప్రాజెక్టులు ఆకట్టుకోగా, కోడింగ్ విభాగంలో పైథాన్, హెచ్టిఎమ్ఎల్, ఇంటర్నెట్ సేఫ్టీ, ఆటోమేటిక్ రెయిన్ షీల్డ్, క్యాలిక్యులేటర్, ఎర్త్ అరౌండ్ ది సన్, బర్త్‌డే కేక్, ఫ్లాగ్ బుక్ వంటి ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్కిల్ దర్బార్‌లో డిజిటల్ స్టోరీ టెల్లింగ్, ఈకో ఫ్రెండ్లీ పేపర్ బ్యాగ్ ప్రాజెక్టులు ప్రదర్శించబడ్డాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కె. అశోక్ రెడ్డి, ఫిరోజ్ ఖాన్, సుప్రియా, కుడాలి శ్రీనివాస్, బి. సురేందర్ రెడ్డి, ప్రకాష్, పద్మజ, అలెగ్జాండర్, షోయబ్, విజయ్, సుప్రియ హాజరయ్యారు. యూలో టెక్కీ ప్రతినిధులు, పాఠశాల ప్రిన్సిపల్ జంగా సునీత మనోహర్ రెడ్డి దీపప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ప్రిన్సిపల్ మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు, మొబైల్ యాప్ డెవలప్‌మెంట్, కోడింగ్ వంటి నైపుణ్యాలను విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే నేర్చుకోవడం అవసరమని అన్నారు. కరస్పాండెంట్ సునీత మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విజయవంతంగా ముగిసిన వి.ఎస్.పి.ఎల్ క్రికెట్ టోర్నమెంట్



**అచ్చంపేట ,జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ కేంద్రం 13వ వార్డులో వి.ఎస్.పి.ఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఐదు రోజులపాటు ఉత్సాహంగా జరిగింది. పది జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హార్డ్ కిల్లర్ జట్టు విజేతగా నిలవగా, పవర్ ఈటర్ జట్టు రన్నరప్‌గా నిలిచింది.మాన్ ఆఫ్ ది మ్యాచ్ సాత్విక్‌గా ఎంపిక కాగా, మాన్ ఆఫ్ ది సిరీస్ శివకృష్ణగా నిలిచాడు. విజేతలకు బహుమతులను 13వ వార్డు కౌన్సిలర్ శివకృష్ణ అందజేశారు.ఈ కార్యక్రమంలో నిరంజన్, మల్లేష్, సాంబశివ, పర్వతాలు, రామకృష్ణ, జాన్ రాజ్, రాము, విజయ్, ఉదయ్, సురేష్, వరుణ్, జాన్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## దోపిడి దొంగల బీభత్సం

**హుస్నాబాద్, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



అరెపల్లి గ్రామానికి చెందిన స్వప్న నివాసంలో జనవరి 11న రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి మహిళ మెడలో ఉన్న సుమారు 2.5 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటనలో బాధితురాలి మెడకు స్వల్ప గాయాలు అయ్యాయి.ఫిర్యాదు మేరకు హుస్నాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు పుదారి శివగా గుర్తించి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రూ.50,000 నగదు, రూ.60,000 విలువైన కొత్త ఒప్పో ఫోన్, రియల్ మీ ఫోన్, పావు తుల పుస్తెలు, 25 గ్రాముల బంగారం లోన్ పెట్టిన బ్యాంకు రసీదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన క్రైమ్ కానిస్టేబుల్ నరేష్‌ను సర్కిల్ ఇన్స్పెక్టర్ అభినందించారు.

### అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు

**కరీంనగర్, జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నగునూరు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. నగునూరు గ్రామానికి చెందిన ఒల్లేపు అజయ్, బండారి సంపత్ అనుమతులు లేకుండా వాగు నుండి ఇసుకను ట్రాక్టర్లలో కరీంనగర్ వైపు తరలిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసి కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పి.డి యాక్ట్ కూడా నమోదు చేస్తామని రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## నల్లమల్లలో ఆందోళనకర పరిస్థితి - గువ్వల బాలరాజు



**అమ్రాబాద్ ,జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అచ్చంపేట నియోజకవర్గం ప్రజాస్వామ్య పాలనలో లేదని, నక్సలైట్లు, గూండాలు, బెదిరింపు రాజకీయాల చేతిలో బందీ అయిందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు గువ్వల బాలరాజు తీవ్రంగా విమర్శించారు.ప్రస్తుత ఎమ్మెల్యే వాంశీకృష్ణకు నక్సలైట్లతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలు ప్రజల్లో విస్తృతంగా చర్చకు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. నక్సలైట్లు స్వేచ్ఛగా తిరుగుతుంటే నోరు మెదపని ఎమ్మెల్యే, బీజేపీ కార్యకర్తలు ప్రజాస్వామ్యబద్ధంగా ఫ్లెక్సీలు పెడితే మాత్రం పోలీసులను పంపించి తొలగించడం ఆయన దుష్పాలనకు నిదర్శనమని అన్నారు.ప్రజలను రక్షించాల్సిన ఎమ్మెల్యే ప్రజలకే భయంగా మారాడని, అభివృద్ధి, పాలన శూన్యంగా ఉన్నప్పటికీ బెదిరింపులు, దోపిడీ మాత్రం విస్తృతంగా జరుగుతున్నాయని బాలరాజు వ్యాఖ్యానించారు. నక్సలైట్లకు రాజకీయ రక్షణ కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది దేశ భద్రతకు ముప్పు అని ఆయన హెచ్చరించారు. వాంశీకృష్ణపై వెంటనే కేసు నమోదు చేసి విచారణ జరిపి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ, ముఖ్యమంత్రి ఈ అంశంపై స్పందించకపోతే ప్రభుత్వం కూడా బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యం, ప్రజల భద్రత కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మాంగ్య నాయక్, బాలాజీ, రేణయ్య, మదునాగుల మహేందర్, శంకర్ మాదిగ, శ్రీను నాయక్, రామోజీ, నిలం రవి, శ్రీనివాస్, పెద్దులు యాదవ్, చందులాల్ చౌహాన్, రాములు, రాం చందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ సిబ్బందికి యూనిఫామ్ పంపిణీ

**అమ్రాబాద్ ,జనవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమ్రాబాద్ గ్రామపంచాయతీ సిబ్బందికి యూనిఫామ్‌లు అందజేశారు. సర్పంచ్ చిగుర్ల కోటయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బందికి చీరలు, యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ సిబ్బంది అయూబ్, ఇసాక్, వెంకటయ్య, రమేష్, రజియా, చంద్రమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం-2005:-ఏ సెక్షన్ దేనికోసం ?

SAMACHARA HAKKU CHATTAM RAKSHANA SAMITHI

**దేవరకొండ జనవరి 25. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
(తెలుసుకోవాల్సిన ముఖ్యమైన విషయాలు )
సమాచార హక్కు చట్టంలో 31 సెక్షన్లు ఉన్నప్పటికీ సామాన్యులకు నిత్యం ఉపయోగపడేవి కేవలం 5 నుండి 6 మాత్రమే. అవేంటో తెలుసుకుందాం :-
స.హ.చట్టం రక్షణ సమితి వ్యవస్థాపక & రాష్ట్ర అధ్యక్షులు డా,, కొర్ర. కిషన్ నాయక్

1) సెక్షన్ 6(1)-సమాచారం కోరడం (అప్లికేషన్ ):-మీకు ఏదైనా సమాచారం కావాలన్నా, ఫైల్స్ చూడాలన్నా లేదా డాక్యుమెంట్ కాపీలు కావాలన్నా ఈ సెక్షన్ కిందే దరఖాస్తు చేయాలి.
లిఎవరికి? సంబంధిత శాఖలోని పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (పిఐఒ)కి.

2)సెక్షన్ 7(1)- గడువు మరియు ప్రాణరక్షణ :సాధారణంగా సమాచారం 30 రోజుల్లోపు ఇవ్వాలి. కానీ, ఒక వ్యక్తి యొక్క 'జీవితం మరియు స్వేచ్ఛ '(లైఫ్ అండ్ లీబెర్టీ )కు సంబంధించిన



సమాచారం అయితే కేవలం 48 గంటల్లోనే ఇవ్వాలని ఈ సెక్షన్ చెబుతుంది.

3)సెక్షన్ 6(3)-అప్లికేషన్ బదిలీ :-మీరు పొరపాటున ఒక శాఖకు పంపవాల్సిన అప్లికేషన్ను మరో శాఖకు పంపితే, ఆ అధికారి దాన్ని తిరస్కరించకూడదు. ఈ సెక్షన్ ప్రకారం 5 రోజుల్లోపు సరైన శాఖకు బదిలీ చేయాలి.

4)సెక్షన్ 19(1)-మొదటి అప్పీల్ (ఫస్ట్ అప్పీల్):-30 రోజులు దాటినా సమాచారం రాకపోయినా, లేదా ఇచ్చిన సమాచారం తప్పుగా ఉన్న... అదే ఆఫీసులోని పై అధికారికి (ఆపిలైట్ అథారిటీ)ఈ సెక్షన్ కింద అప్పీల్ చేయవచ్చు.

5)సెక్షన్ 19(3)-రెండో అప్పీల్ (సెకండ్ అప్పీల్):-మొదటి అప్పీల్ చేసినా ఫలితం లేకపోతే, నేరుగా రాష్ట్ర సమాచార కమిషనర్ కు (స్టేట్ ఇన్ఫర్మేషన్ కమీషనర్)ఈ సెక్షన్ కింద పిర్యాదు చేయవచ్చు.

6)సెక్షన్ 18-పిర్యాదు చేయడం :-అధికారి అప్లికేషన్ తీసుకోవడానికి నిరకారించినా, సమాచారం ఇవ్వడానికి అధిక ఫిజు అడిగినా నేరుగా కమిషన్ కు ఫిర్యాదు చేసే హక్కును ఈ సెక్షన్ ఇస్తుంది.

7) సెక్షన్ 20-జరిమానా :-
సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించే అధికారులకు రోజుకు 250 రూపాయల నుండి గారిష్టంగా 25,000 రూపాయల వరకు జారినమా విధించే అధికారం ఈ సెక్షన్ ద్వారా కమిషన్ కు ఉంటుంది.

ముఖ్యమైన విషయం :- తెల్ల కాగితం మీద రాసినా లేదా ఆన్ లైన్ లో అప్లై చేసినా =✕ చెల్లుతుంది.

అప్లికేషన్ చివర్లో "సమాచారం హక్కు చట్టం-2005,సెక్షన్ 6(1) ప్రకారం సమాచారం కోరుతున్నాను" అని రాయడం మర్చిపోకండి.

సాక్ష్యల కోసం మీరు దరఖాస్తు పంపిన పోస్టల్ రసీదును భద్రపారుచుకోండి. సలహాలు సూచనలు కొరకు ఫోన్ నెం 9885122005 కు సంప్రదించగలరు.

## డిండిలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

**-విద్యార్థినుల భారీ అవగాహన ర్యాలీ.**

**దేవరకొండ జనవరి 25. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, దేశ భవిష్యత్తును నిర్ణయించే బాధ్యత ఓటర్లపైనే ఉందని డిండి మండల తహశీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్గొండ జిల్లా డిండి మండల కేంద్రంలో ఆదివారం చైతన్య కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.
హోరెత్తిన నినాదాలుడఉత్సాహంగా ర్యాలీ: ఈ సందర్భంగా టీజీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ మరియు జూనియర్ కాలేజీ విద్యార్థినులు మండల కేంద్రంలో భారీ అవగాహన ర్యాలీ చేపట్టారు. 'ఓటు మన హక్కు - దేశానికి రక్షణ' అంటూ విద్యార్థినులు చేసిన నినాదాలు స్థానికులను ఆలోచింపజేశాయి. ప్రధాన వీధి గుండా సాగిన ఈ



ర్యాలీ ఓటు ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించింది.
ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహశీల్దార్ శ్రీనివాస్, మండల విద్యాధికారి ఇస్లావత్ గోప్యా నాయక్ హాజరై ర్యాలీని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ..

-18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి.
- ప్రజాస్వామ్య రక్షణకు ప్రతి ఓటు ఎంతో విలువైనది.
- నిష్పక్షపాతంగా, ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి.

ఓటరు ప్రతిజ్ఞ: ర్యాలీ అనంతరం తహశీల్దార్ శ్రీనివాస్ విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ప్రజాస్వామ్య సాంప్రదాయాలను కాపాడుతామని, నిర్భయంగా ఓటు వేస్తామని విద్యార్థులు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష, అధ్యాపక బృందం, పాఠశాల సిబ్బంది మరియు పెద్ద ఎత్తున విద్యార్థినులు పాల్గొన్నారు.

## కడ్తాల్ మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ను ప్రారంభించిన దశరథ్ నాయక్



**-స్థానిక బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామకృష్ణతో కలిసి ప్రారంభించిన కడ్తాల్ మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్**

**కడ్తాల్, జనవరి 25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కడ్తాల్ మండల కేంద్రంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ జన్మదినం సందర్భంగా మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. స్థానిక టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామకృష్ణతో కలిసి వాలీబాల్ టోర్నమెంట్ ను ఆదివారం కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు,రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వైస్ ఎంపీపీ ఆనంద్ పుట్టినరోజు సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం క్రీడాకారుల ప్రతిభను చాటి చెప్పడానికి ఎంతగానో ఉపయోగ పడతాయని అన్నారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఇలాంటి పోటీలకు క్రీడాకారులు వేదికగా చేసుకొని గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు మండల స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి వరకు రానిచ్చి కడ్తాల్ మండలానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ క్రీడల వల్ల యువత మానసిక ఉల్లాసంతో పాటు క్రీడా స్ఫూర్తిని చాటుతాయని క్రీడల్లో యువత చెడు అలవాటులకు దూరంగా ఉండి క్రీడల వైపు మల్లడానికి క్రీడలు ఉపయోగపడతాయని శారీరక మానసిక ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు నాయకత్వ లక్షణాలు టీం వర్క్ నేర్చుకుంటారని క్రీడాకారులకు సూచించారు. వాలీబాల్. కబడ్డీ. షటిల్. క్రికెట్ వంటి క్రీడలలో యువత తన ప్రతిభను చాటాలన్నారు.కుల రాజకీయ భేదాలు మరచి ఒక జట్టుగా ఆడినప్పుడు నిజమైన మండల ఐక్యత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నాయకులు మంగళపల్లి నరసింహ, మహేష్, వెంకటేష్, సంతోష్, రాఘవేందర్,నరేష్,వినయ్, జగన్, శ్రీకాంత్, రాజా,దేవేందర్, రాజేందర్, సోను,లక్ష్మణ్, క్రీడాకారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి వారి రథసప్తమి బ్రహ్మోత్సవ వేడుకలు

**- జాలేనరసింహారెడ్డి**



**దేవరకొండ జనవరి 25. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
చింతపల్లి మండలంలోని గొల్లపల్లి గ్రామంలో గ్రామ ప్రజలు నిర్వహించిన శ్రీశ్రీశ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి రథసప్తమి బ్రహ్మోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించినజాలే నరసింహారెడ్డిపీసీసీ సభ్యులు పిఏసియస్ చైర్మన్.
అనంతరం మాట్లాడుతూ దేవరకొండ ప్రాంత ప్రజలపై ఆ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి ఆశీస్సులు ఉండి సకాలంలో వర్షాలు కురిసి ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో పాడి పంటలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సత్యనారాయణ, చైర్మన్ వెంకటయ్య, సర్పంచ్ అనంతుల శ్రీను, ఉప సర్పంచ్ మహేష్, భాస్కర్, శ్రీను, సాయిలు, పరమేశ్, సాయిలు, మరియు ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మన్సాన్ పల్లి చౌరస్తాలో భారీ నిరసన చేపట్టిన కాంగ్రెస్.



**మహేశ్వరం,జనవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరంలో కేఎల్ఆర్ మాట్లాడుతూ..జాతీయ ఉపాధి హామీ పథకంలో మహాత్మాగాంధీ పేరు తొలగించి... వీబీ జీరామ్ జీ పేరును పెట్టడంపై భారీ నిరసన చేపట్టారు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి.
మన్సాన్ పల్లి చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేఎల్ఆర్ హాజరయ్యారు. ఈ సందర్భగా కిచ్చెన్న మాట్లాడుతూ... జాతీయ ఉపాధి హామీ పథకానికి నిధులన్నీ కేంద్రమే భరించాలని డిమాండ్ చేశారు.ఉపాధి పని కల్పించే బాధ్యతను గ్రామ సర్పంచ్ లకే అప్పగించాలని కోరారు.
ప్రధాని మోడీ సర్కార్ ఢిల్లీలో కూర్చుని చట్టాలు మార్చి.... గ్రామీణ పేదల పొట్టకొట్టడాన్ని తీవ్రంగా ఖండించారు.
క్రమంగా జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తున్న విషయాన్ని ఇంటింటికీ తెలియజేయాలని లక్ష్మారెడ్డి కోరారు.
గాంధీజీ పేరును మళ్లీ ఉపాధి హామీకి కొనసాగించాలని డిమాండ్ చేశారు.
ప్రతీ పేదవాడికి పని కల్పించే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జాతీయ ఉపాధి హామీ పథకం తెచ్చారని కేఎల్ఆర్ గుర్తు చేశారు.రాష్ట్రాల హక్కులు, సర్పంచుల అధికారాలను తగ్గించే కుయుక్తులకు బీజేపీ పాల్పడుతుందని కిచ్చెన్నగారు ఆరోపించారు.
ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆరోపణలను ఖండించిన కుంద మల్లికార్జున్



**అచ్చంపేట, జనవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అచ్చంపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ నాయకుడు కుంద మల్లికార్జున్ ఘాటుగా స్పందించారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యమని, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు విద్రోహ శక్తులతో ఎలాంటి సంబంధాలు లేవని ఆయన స్పష్టం చేశారు.కావాలనే ఉద్దేశపూర్వకంగానే గువ్వల బాలరాజు అసత్య ప్రచారం చేస్తున్నారని మల్లికార్జున్ మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలకు వాస్తవాలు బాగా తెలుసు, ఎవరు ఎలాంటి మాటలు మాట్లాడినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఆయన వ్యాఖ్యానించారు.అసత్య ఆరోపణలు మానుకోవాలని, లేదంటే తగిన సమయంలో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. బడుగు బలహీన వర్గాలను ఒక తాటిపైకి తీసుకువచ్చి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఎమ్మెల్యే వంశీకృష్ణను ప్రజల నుంచి దూరం చేయలేరని మల్లికార్జున్ స్పష్టం చేశారు.

# శ్రీ వేణుగోపాలస్వామి కళ్యాణ వైభోగం

- మక్తమాదారంలో కనుల పండువగా స్వామివారి కళ్యాణం
- పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు



**కడ్తాల్, జనవరి 25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండలం మక్తమాదారం శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం అదివారం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త, అర్చకుడు తిరుమల వింజమూరి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో బాజాభజంత్రీలు, వేదమంత్రాల నడుమ కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. కల్యాణం అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారికి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పూజలు చేశారు. కార్యక్రమంలో చక్రవర్తి, ఆదిత్య, వెంకటరంగాచారి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, అమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, సర్పంచి నర్సింహా గౌడ్, ఉప సర్పంచి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ కడ్తాల్ మండల అధ్యక్షుడు అర్కోటం బాలరాజ్, మాజీ సర్పంచులు సులోచనల సాయిలు, లక్ష్మీ నర్సింహారెడ్డి, మాజీ ఎంపిటిసి మంజుల చంద్రమౌళి, వార్డు సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# కడాల చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్ కు ఆహ్వానం



**కడ్తాల్, జనవరి 25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండల కేంద్రంలో వెలసిన శ్రీశ్రీశ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 29 నుండి 3 వరకు జరగనున్నాయి. ఈ మేరకు ఆలయ అభివృద్ధి చైర్మన్ పాలాది ఆంజనేయులు స్థానిక మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డితో కలిసి పలువురికి ఆహ్వాన పత్రికలు అందజేశారు.ఆదివారం కడ్తాల్ మండల కేంద్రంలో మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్ కు ఆహ్వాన పత్రిక అందజేశారు.వారం రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవ కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఉత్సవాలను జయప్రదము చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మండల మాజీ రైతు అధ్యక్షుడు జోగు వీరయ్య, మాజీ వార్డు సభ్యులు మూడ అశోక్, నాయకులు పర్వత కుమార్ యాదవ్, క్యామ సత్యం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న సుంకిరెడ్డి



**మాడ్గుల, జనవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మాడ్గుల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో ఆదివారం రథసప్తమి పర్వదినం సందర్భంగా స్వామివారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై, స్వామివారి కళ్యాణం అనంతరం దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని దేవుని ప్రార్థిస్తున్నాను" అని తెలిపారు. అదేవిధంగా దేవాలయం అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.మొదటిసారిగా దేవాలయానికి వచ్చిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చినందుకు ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రజిత దేవయ్య గౌడ్, వార్డు సభ్యులు మద్దెల గణేష్, దార అనూష విష్ణు, మొగిల్ల కృష్ణ, యేరుకలి కాటం గౌడ్, ఎమ్మె శివలీల శేఖర్, నూనె పర్వతాలు, ఐక్యత ఫౌండేషన్ మాడ్గుల ఇంచార్జి జైపాల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు చిక్కుడు జంగయ్య, దార రాములు, మద్దెల యాదయ్య, ఏనుక లక్ష్మణ్, చిక్కుడు శ్రీశైలం, చిక్కుడు కృష్ణయ్యతో పాటు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామికదేశంలో గణతంత్ర దినోత్సవానికి విలువెక్కడా?




మనదేశంలో గణతంత్ర దినోత్సవమంటే రాజ్యాంగం అమలులోకి వచ్చినరోజని అర్థం.రాజ్యాంగమంటే భారతదేశాన్ని సార్వభౌమ,సామ్యవాద,లౌకిక,ప్రజాస్వామ్య,గణతంత్ర రాజ్యంగా ప్రకటిస్తూ,పౌరులందరికీ సామాజిక,ఆర్థిక,రాజకీయ న్యాయం,స్వేచ్ఛ, సమానత్వం,సౌభ్రాతృత్వం కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం.అందుకే ప్రతియేటా జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకను ప్రతిచోట ఉపన్యాసాలతో ఘనంగా జరుపుకుంటున్నాము.కానీ ఆచరణలో అమలవుతున్నాయా ? అని ఎవరికీవారు ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాల్సినవసరం ఎంతైనా ఉన్నది.రెండుశతబ్దాల బ్రిటిష్ పాలననుండి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే అందులోభాగంగానే 1946 జూలైలోనే డా.రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన రాజ్యంగకమిటీ ఏర్పడితే డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మెన్ గా డా.బిఆర్ అంబెడ్కర్ ఎన్నికయ్యారు.ఆ కమిటీలోని 299 సభ్యులు దాదాపు రెండుసంవత్సరాల పదకొండు నెలల పద్దెనిమిది రోజులు కష్టపడి ఎన్నోదేశాలు తిరిగి అక్కడి రాజ్యాంగాలను తిరిగేసి,ఎన్నో సమావేశాలు జరుపుకొని చర్చించుకోని,పలు సమస్యలకు పరిష్కార మార్గాలను చూపుతూ,బలహీన వర్గాలు,నిమ్న కులాలకు అండగా నిలుస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్నీ లిఖించడం జరిగింది.దానిని 1949 నవంబర్ 26 న భారతప్రభుత్వానికి అంకితంచేస్తే 1950 జనవరి 26 నుండి అమలులోకి తీసుకరావడం జరిగింది.ఇందులో ప్రదానంగా ప్రజాస్వామ్యం ఎలా కొనసాగాలి ? పాలన ఎలా గావించాలి ? అభివృద్ధికి బాటలెలా వెయ్యాలి ?ప్రజలకు కావాల్సిన ప్రాథమికహక్కులేవి?ప్రతిఒక్కరి విధులేలా ఉండాలి ? అట్టడుగు వారిని ఎలా కాపాడాలి? స్వేచ్ఛ,సమానత్వం ఎలా చూపాలి ? దేశ సమగ్రతను ఎలా కాపాడాలి ? లౌకికతత్వాన్నికి,సోషలిజానికి ప్రాధాన్యతనిస్తూ దేశాభివృద్ధికి పాటుపడటమెలా? భావప్రకటన స్వేచ్ఛ ఎలా ఉండాలి? లాంటి మరెన్నోప్రశ్నలకు సమాధానమే మన రాజ్యాంగం.

దేశంలో నిమ్నవర్గాలపై ప్రత్యేకంగా దళితులపై పూర్తిగా అంటరానితనం,అస్పృశ్యత,అసమానత్వ విధానాలు వైదొలిగాయా అంటే సమాధానంలేని ప్రశ్నగా మిగిలిపోతుంది.ఇంకా ఆధిపత్యకులాల నీడలో నిమ్నకులాలు ఎలాంటి కష్టాలు,బాధలు,చీదరింపులను ఎదుర్కుంటున్నారో అందరికీ తెలిసిన విషయమే.వివక్షతకు చరమగీతం పాడుతూ,సమానత్వానికి,స్వేచ్ఛకు ప్రాముఖ్యతనిస్తూ,అధిపత్యకులాల అధీనంలో అష్టకష్టాలుపడుతున్న బహుజనులకు స్వేచ్ఛను కల్పిస్తూ,చదువుకోవడానికి బడులను,భూమిలేని నిరుపేదలకు వ్యవసాయం నిమిత్తం భూపంపిణి,ప్రజాస్వామ్యంలో భాగంగా ప్రతిఒక్కరికి ఓటుహక్కు కల్పిస్తూ,పాలనవకాశాలతోపాటు మహిళలకు పురుషులతో సమానంగా స్వేచ్ఛనుకల్పిస్తూ అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలి.కానీ ప్రజాస్వామ్యం నీడలో ఇంకా రాచరిక విధానమే కొనసాగుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు.ఇప్పటికి పలుచోట్ల పేద దళితబహుజనులపై జరిగే దాడులను చూస్తే ఈ సమాజం ఎటువైపుపయనమిస్తుందో అర్థంకాదు.గడిచిన పాతిక ఏళ్ళలో పేద దళితబహుజనులపై అత్యధికంగా కేసులు,హత్యలు,అత్యాచారాలు నమోదుకావడం చూస్తుంటే ఇంకా వివక్షత కొనసాగుతుందా ? అనే అనుమానం కలుగకమానని పరిస్థితి.ఇంకా బాధాకరమైన విషయమేమిటంటే డా.బిఆర్ అంబేద్కర్ ఒక సామాజికవర్గానికి చెందినవారని,ఇలా మరికొందరి మహనీయులను ఎవరికివారు పంచుకోని ఆరాధించడం వారిమూర్ఖత్వమే అవుతుంది.తమ జీవితాలను అంకితంచేసి,సమాజ శ్రేయస్సుకోసం పాల్పడిన ప్రతిఒక్కరు మహనీయులే అవుతారు.అలాంటి వారిని యావత్తుదేశం ఆరాధించి,వారి గొప్పతనాన్నీ రాబోయే తరాలకు తెలియజేస్తూ,వాళ్ళను ఆదర్శంగా తీసుకోని వారుచేసిన బాటలో నడవడానికి ప్రయత్నించాలే తప్పా,ఇంకా కించపరిచే,దిగదార్చే పనులకు పూనుకోకూడదు.మహనీయులకు సరైన నివాళి సమర్పించాలంటే,వారికి సంబంధించిన ఏ కార్యక్రమమైన అంగరంగా వైభవంగా ఏర్పాట్లుచేసి,ఫోటోలకు,పత్రికల ప్రకటనలకు ప్రాధాన్యతనిస్తూ,ఇంకొకరిని దూషించడం కాదు.వారు కోరుకున్న సమాజనిర్మాణానికై తలపెట్టిన మార్గాలను ఎంచుకోని,పయనించి అనుకున్న లక్ష్యాలను చేరుకోని,సమాజ శ్రేయస్సుకు పాటుపడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.ఇప్పటికి పలుప్రాంతాలలో రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్స్ సహాయంతో పాలకవర్గంలోకి ప్రవేశించి,ఆధిపత్య కులాలవారికి కొమ్ముకాస్తూ,విగ్రహ రూపందాల్చి తమస్వార్థంకోసం పనిచేసేవారు పునరాలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.బహుజనులలో అగ్రస్థానాలకు ఎదిగిన వారందరు,తమప్రజల క్షేమం,సంక్షేమం, అభివృద్ధికి నోచుకోని పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.ఇప్పటికి అభివృద్ధికి నోచుకోలేని నిమ్న కులాలకుచెందిన బడుగు,బలహీన వర్గాల ప్రజలు ఇంకా అణిచివేతకు గురవుతున్నారు.ఆయా సామాజికవర్గాలకు చెందిన వారెవ్వరన్నా అభివృద్ధిదిశలో పయనిస్తే,తనవారి గురించి ఆలోచించాల్సిన అవసరం ఉన్నది.ఎందుకంటే ఆనాడు మహనీయులు సైతం తమ స్వార్ధాలకనుగుణంగా ఆలోచిస్తే,నేడు ఈ స్వేచ్ఛ ఉండేదికాదు.కావున కనీస మానవత్వంతో ఆలోచించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.సమాజంలో అత్యధిక జనాభా శాతం కలిగిన బహుజనులు నేడు అల్పసంఖ్యాక శాతం కలిగిన ఆధిపత్యకులాలకు చెందినవారి పాలనలో కొనసాగుతున్నారంటే వారియొక్క ఆలోచనవిధానాన్ని పసిగట్టక,వేరుచేసే విధానంలో విభజించి-పాలించే విధానాలకు దాసోహమై,చదువుకున్న అవివేకులా మారుతున్నారా ? అనే ఆలోచన కలిగిన ఆశ్చర్యంపోనక్కరలేదు.

రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్స్ పొందాల్సినంత మేరలో పొందలేకపోయిన, ఉన్నదాంట్లో సైతం ఆర్థికపరిస్థితుల కారణంగా కొన్ని కుటుంబాలకే పరిమితమై,ఐక్యతను దెబ్బతీస్తుంటే,రాజ్యాంగంలోని లొసుగులను అడ్డంపెట్టుకోని ఈపెత్తనం చేయడం దేనికి నిదర్శనమే ఆలోచించాలి.నేడున్న పరిస్థితులలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి.ప్రపంచీకరణలో నేపథ్యంలో భూగోళమంతా కుగ్రామంగా తయారయ్యింది.రోజురోజుకు పేట్రేగిపోతున్న శాస్త్ర,సాంకేతికపరిజ్ఞానం వలన ఎక్కడ ఏంజరిగిన క్షణాల్లో తెలిసిపోతుంది.ఇంట్లో కూర్చోని ప్రపంచానికి సంబంధించిన సమాచారాన్ని అరచేతిలో తెలుసుకునే వీలున్నప్పుడు,సమాజంలో ఏం జరుగుతుంది ?ఎలా జరుగుతుంది?సత్య,అసత్యాలను బేరీజువేయడం లాంటి పనులు చేయకుండా,పక్షపాతధోరణితో,స్వార్థపు ఆలోచనలతో,మానవత్వాన్ని సైతం మంటగలిపి మనుగడసాగించడం ఎంతవరకు సబబుయే పునరాలోచించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.నేడున్న యువత విలువైన సమయాన్నీ కాలక్షేపంతో వృధాచేయకుండా,మహనీయుల గురించి తెలుసుకుంటూ,వారి ఆలోచన విధానాన్ని అనుసరించే విదంగా మార్పుచెందాలి.అంతేగానీ మహనీయుల జయంతి,వర్థంతి వేడుకలు వచ్చినప్పుడు పేపర్లో ప్రకటనలకో,ఫోటోలుదిగి సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేసి,లైక్ లు,కామెంట్లకు పరిమితంగాకుండా వారియొక్క భావజాలాన్ని అందిపుచ్చుకోని,వారుచూపిన దారుల్లో నడిచినప్పుడే వారికి అసలైన గౌరవం ఇచ్చినట్లవుతుంది.కావున ప్రతిఒక్కరు మహనీయులను ఆదర్శంగా తీసుకోని ఆచరణలో మమేకమై సమసమాజ నిర్మాణానికి పూనుకుంటేనే ఇలాంటి దినోత్సవాలకు విలువనిచ్చినవారవుతారని గ్రహించాలి.

**డా.పోలం సైదులు,**
**డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ,**
**441930361.**



# గణతంత్ర దినోత్సవం.. 982 మంది పోలీసులకు అవార్డులు

**ఢిల్లీ,జనవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రిపబ్లిక్ డే సందర్భంగా 982 మంది పోలీసులకు కేంద్ర ప్రభుత్వం అవార్డులు ప్రకటించింది. పోలీసులు, ఫైర్ సిబ్బంది, హోంగార్డులు గ్యాలెంటరీ, సర్వీస్ మెడల్స్ పొందారు. అలానే రాష్ట్రపతి అవార్డులకు ఆరుగురు సీబీఐ అధికారులు ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా 25 మందికి పోలీస్ మెడల్స్ అందుకోనున్నారు. హెడ్ కానిస్టేబుల్ మర్రి వెంకట్‌రెడ్డి(తెలంగాణ) గ్యాలెంటరీ అవార్డుకు ఎంపికయ్యారు. అలానే ఏఎస్పీ ఆర్.ఎం.కె.తిరుమలాచారి(ఏపీ)కి ప్రెసిడెంట్ మెడల్, అదనపు ఎస్పీ జి.ఎస్.



ప్రకాష్‌రావు(తెలంగాణ) ప్రెసిడెంట్ మెడల్ పొందారు.తెలంగాణ నుంచి ఎస్ఐ దామోదర్‌రెడ్డికి ప్రెసిడెంట్ మెడల్(పీఎస్ఎం) దక్కింది. అలానే మెడల్ ఫర్ మెరిటోరియస్ విభాగంలో 12 మంది ఎంపికయ్యారు. ఐజీ సుమతికి మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ అవార్డు లభించింది. ఎంఎస్ఎం ఫైర్ విభాగంలో ముగ్గురికి అవార్డులు దక్కాయి. ఎంఎస్ఎం హోంగార్డు, సివిల్ డిఫెన్స్ విభాగంలో ముగ్గురు, ఎంఎస్ఎం కరెక్షనల్ సర్వీస్ విభాగం ఇద్దరు అవార్డులకు ఎంపికయ్యారు. ఇక ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంఎస్ఎం కరెక్షనల్ సర్వీస్ విభాగంలో ముగ్గురు, మెడల్ ఫర్ మెరిటోరియస్ విభాగంలో 15 మంది అవార్డు అందుకోనున్నారు.

## నల్గొండ మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం



**నల్గొండ, జనవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన 6వ డివిజన్ కార్పొరేట్ అభ్యర్థిగా కర్నాటి సునంద కర్ణాకర్ రెడ్డి, 25వ డివిజన్ అభ్యర్థిగా జూలకంటి ధనలక్ష్మి శ్రీనివాస్, 41వ డివిజన్ అభ్యర్థిగా కేసాని వేణుగోపాల్ రెడ్డి, 19వ డివిజన్ అభ్యర్థిగా గోగుల గణేష్ పేర్లను ప్రకటించారు.ప్రచారంలో ట్రాక్టర్ నడిపి కార్యకర్తలను ఉత్సాహపరిచిన కోమటిరెడ్డి, నల్గొండ మున్సిపాలిటీ అభివృద్ధి తన ఆధ్వర్యంలోనే జరిగిందని, పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అభివృద్ధి శూన్యమని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి వేగవంతమైందని, రూ.2200 కోట్లతో నల్గొండ మున్సిపాలిటీలో పనులు చేపట్టినట్లు తెలిపారు.నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 48 డివిజన్లలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చిన ఆయన, అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థులు గెలిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు.

## అర్ధ శతాబ్ది తర్వాత అపూర్వ సమ్మేళనం



**నల్లగొండ, జనవరి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్లగొండ పట్టణంలోని వివేకానంద స్కూల్ 1975,76,77 సంవత్సరంలలో ఏడవ తరగతి చదువుతున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వి స్టాగ్రాండ్ హోటల్లో ఘనంగా నిర్వహించారు. 50 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలిసిన నాటి విద్యార్థులు గురువులుపి. భగవంత రెడ్డి, మల్లీశ్వరి, గిరి ఉపాధ్యాయులను పాదాభివందనం చేసి ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులు ఆటపాటలతో అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గట్టు ఉదయ్ కుమార్, కంది వెంకట్, సుధారాణి, శశిధర్, శర్మ, రఘుపతి, మిట్టపల్లి వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, వసంత తదితరులు పాల్గొన్నారు.

## రాయపోల్ గ్రామ శాఖ అధ్యక్షులు గా బాసిరెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి నియామకం



**ఇబ్రహీంపట్నం , జనవరి 25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: రాయపోల్ గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం లో నూతన గ్రామ శాఖ ఎన్నికలు నిర్వహించారు. నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా బాసిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మరియు ఉపాధ్యక్షులు గా రాసూరి నర్సింహా. మచ్చ తిరుమలేష్. దొర్నాల రాజు. చింతల నవీన్ మరియు ప్రధాన కార్యదర్శులు గా ఉడుగుల రాకేష్ మరియు దొర్నాల ఆనంద్ మరియు కోశాధికారి గా బుయ్య శివశంకర్ కార్యదర్శులు గా  అచ్చన రమేష్. కానుగుల లాలయ్య. హనుమండ్ల సురేష్. అంకర్ల నర్సింహా మరియు కార్యవర్గ సభ్యులుగా దొర్నాల బాలయ్య. కానుగుల సత్తయ్య. చెరుకు జంగయ్య గార్లని  గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎన్నుకోవడం జరిగింది . ఈ కార్యక్రమంలో.... రాష్ట్ర సేవాదళ్ ఉపాధ్యక్షులు మంకాల దాసు , 4వ వార్డు మెంబర్ డొంకని మహేందర్ గౌడ్ , జిలకపల్లి ప్రభాకర్ రెడ్డి , సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రథసప్తమి సందర్భంగా సూర్యనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవం



**అడవిదేవులపల్లి, జనవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని బౌద్ధమగుల్లు దేవాలయంలో రథసప్తమి సందర్భంగా సూర్యనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. 1135 సంవత్సరంలో చోళచాళుక్య సామ్రాజ్యంలో స్థాపించబడిన ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం రథసప్తమి సందర్భంగా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.ఈ సంవత్సరం సర్పంచ్ కూరాకుల చిన్నరామయ్య కుటుంబ సభ్యులు, పద్మశెట్టి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ, స్వామివారి కళ్యాణ మహోత్సవం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతుందని, ప్రతి సంవత్సరం ఇదే విధంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పూర్తి దాతలుగా వ్యవహరించిన కూరాకుల చిన్నరామయ్య, పద్మశెట్టి కోటేశ్వరరావు కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మాజీ ఎమ్మెల్యే చెప్పిన విజయసింహారెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్లబోతు సిద్ధార్థ, కూరాకుల శ్రీనివాస్, కూరాకుల గోపీనాథ్, కూరాకుల రవీంద్రనాథ్, సినీ నటులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేశారు. స్వామివారి కృపా కాటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.

## పాడిపంటలు చల్లగా ఉండాలి

### పెద్దపల్లి మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రేణుక.



**ఎలిగేడు, జనవరి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రజలు ,పాడిపంటలు చల్లగా ఉండాలని సమ్మక్క సారలమ్మను కోరుకున్నట్లు పెద్దపల్లి జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్ పర్సన్ మండిగ రేణుక రాజనర్సయ్య తెలిపారు. సమ్మక్క సారలమ్మ జాతరను పురస్కరించుకొని ఆదివారం ఆమె కుటుంబ సమేతంగా మేడారంలోని సమ్మక్క సారలమ్మ వనదేవతలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. మేడారం వచ్చే భక్తుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల తో పాటు వివిధ రకాల సౌకర్యాలను ఏర్పాటు చేసిందన్నారు. ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలకు మేడారం జాతర నిలువెత్తు నిదర్శనం అని ఆమె అన్నారు. కోరిన కోరికలు తీర్చే వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆమె ఈ సందర్భంగా తెలిపారు సకల సౌకర్యాలు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు గ్రామ మాజీ సర్పంచ్ మండిగ రాజనర్సయ్య వార్డు సభ్యురాలు శారద రాజు తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం



**ఆమనగల్, జనవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్ మండల కేంద్రంలో కల్వకుర్తి తాలూకా యూత్ కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జక్కిడి శివకుమార్ రెడ్డి హాజరయ్యారు.ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని సాధించేందుకు యూత్ నాయకులు, కార్యకర్తలు ప్రజల మధ్యకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికే ఇచ్చిన దిశానిర్దేశం ప్రకారం ప్రతి కార్యకర్త కాంగ్రెస్ పార్టీ కోసం కంకణబద్ధులై పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.స్టేట్ ప్రెసిడెంట్ జక్కిడి శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ, స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ డంకా మోగించినట్లే మున్సిపల్ ఎన్నికల్లో కూడా విజయ దుందుభి మోగించాలని యూత్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. మండల యూత్ నాయకులకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్, జిల్లా ఇన్చార్జిలు, అసెంబ్లీ నాయకులు, కల్వకుర్తి తాలూకాలోని ఆరు మండలాల అధ్యక్షులు, వెల్దండ మండల యూత్ అధ్యక్షుడు భరత్ గౌడ్, గ్రామ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం




**కడ్తాల్, జనవరి 25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
కడ్తాల్ మండలం మక్త మాదారం గ్రామంలోని గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ ఇటీవల మృతి చెందిన అర్కోటం చిన్న నారాయణ కుటుంబాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పరామర్శించారు. రూ.5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ వెంకటేష్ గుప్తా, సర్పంచ్ నర్సింహా గౌడ్, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహా రెడ్డి, మాజీ ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి, ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీను, జోగు విరయ్య, సత్యనారాయణ గౌడ్, కొట్య నాయక్, క్రిష్ణయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రామేశ్వరంలో కొబ్బరికాయల టెండర్ పూర్తి



**షాద్‌నగర్, జనవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్‌నగర్ మండలంలోని శ్రీ రామలింగేశ్వరం దేవస్థానంలో కొబ్బరికాయల టెండర్ ప్రక్రియ శనివారం పారదర్శకంగా పూర్తయింది. గంట్లవెల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యాదయ్య బహిరంగ వేలంలో పాల్గొని రూ.35 లక్షలకు టెండర్‌ను దక్కించుకున్నారు.ఈ టెండర్ కాలపరిమితి 2026 ఫిబ్రవరి 1 నుండి 2027 మార్చి 31 వరకు కొనసాగనుంది. టెండర్ మొత్తంలో 50 శాతం రెండు రోజుల్లో, మిగతా మొత్తాన్ని 90 రోజుల్లోపు చెల్లించాలని దేవదాయ శాఖ అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే టెండర్ రద్దు చేసి, చెల్లించిన మొత్తాన్ని జప్తు చేస్తామని హెచ్చరించారు.దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ మోహన్, ఈవో శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రామేశ్వరం సర్పంచ్ మానస సురేష్, మాజీ సర్పంచ్‌లు ఆశన్న గౌడ్, దిద్దెళ్ల కృష్ణయ్య, సంపత్ కుమార్, మాజీ ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, మోహన్ రెడ్డి, మిలిటరీ వెంకట్ రెడ్డి, మాజీ డిప్యూటీ సర్పంచ్ రత్న సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## మహేష్ వ్యాఖ్యలు హాస్యాస్పదం: పాండురంగారెడ్డి



**హైదరాబాద్, జనవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి తీవ్రంగా ఖండించారు. కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలోకి వస్తానంటే నేను వద్దన్నాను అన్న మాటలు హాస్యాస్పదమని ఆయన మండిపడ్డారు.ఆదివారం విలేకరులకు అందజేసిన ప్రకటనలో పాండురంగారెడ్డి మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక, రాష్ట్ర ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించలేక కాంగ్రెస్ ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో ఉందని విమర్శించారు. ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత నుండి దృష్టి మళ్లించడానికే ఇటువంటి అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు.త్వరలో రాజకీయ పార్టీగా అవతరించబోతున్న తెలంగాణ జాగృతికి వస్తున్న ప్రజాదరణను చూసి భయపడి మహేష్ కుమార్ గౌడ్ సత్యదూరమైన మాటలు మాట్లాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. పార్టీని చక్కదిద్దుకోలేక, నాయకత్వాన్ని సమన్వయం చేయలేక సతమతమవుతున్న పీసీసీ అధ్యక్షుడు, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని సూచించారు.ప్రజల అభిమానాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ తన ఉనికిని కాపాడుకోవడానికి లేనిపోని అబద్ధాలను ప్రచారం చేస్తోందని, ఇలాంటి చౌకబారు విమర్శలను తెలంగాణ ప్రజలు నమ్మరని పాండురంగారెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతికి ఉన్న నైతిక బలాన్ని దెబ్బతీయాలని చూస్తే ఊరుకునేది లేదని, ఇకనైనా అర్థరహితమైన వ్యాఖ్యలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు.